

కోమటిలంకలో ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే

కొల్లేరు ముంపు ప్రాంతాల్లో కలెక్టర్,ఎస్పీ,ఎమ్మెల్యే పర్యటన

ఏలూరు రూరల్/మండవల్లి : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, కృష్ణానది, బుడమేర నుంచి వస్తున్న జలప్రవాహాలతో కొల్లేరు సరస్సుకు ముంపు పొంచి ఉన్నందున ముంపుప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడానికి కలెక్టర్ వెట్రిసెల్వి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, జిల్లా ఎస్పీ కె.ప్రతాప్‌శివకిషోర్ బుధవారం ఏలూరు రూరల్ మండలం కోమటిలంక వద్ద వరద పరిస్థితిని పరిశీలించి గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణానది వరద నీరు పెరుగుతున్న దృష్ట్యా కొల్లేరు వరద ప్రాంతాల ప్రజలు రెండురోజుల పాటు గ్రామాల్లోనే ఉండాలని, బోట్లు ద్వారా ప్రయాణం చేయవద్దన్నారు. గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. గర్భిణులను ముందుగానే పీహెచ్‌సీలకు తరలించామన్నారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ కోమటిలంక రోడ్డునిర్మాణానికి సంబంధించి గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి నిధులు మంజూరు చేయించానని, ఫారెస్ట్‌శాఖ అనుమతులు లేనందున పనులు జరగలేదని కలెక్టర్‌కు తెలిపారు. ఉప్పుటేరు, రైల్వేట్రాక్ వద్ద గుర్రపుడెక్కను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్డీవో ఎన్.ఎస్.కె ఖాజావలీ, ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో బండి ప్రణవి, ఇరిగేషన్, పోలీస్, ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు. అలాగే మండవల్లి మండలం పెద్దఎడ్లగాడి-పెనుమాకలంక వద్ద రోడ్డు మీద ప్రవహిస్తున్న కొల్లేరు వరద ఉధృతిని కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కూటమి నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, సజ్జ సురేష్‌బాబు ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి రెండు ఎక్స్ కవేటర్లతో గుర్రపుడెక్క, తూడు తొలగిస్తూ లోతట్టు ప్రాంతాలకు వరద నీరు వెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు . వారివెంట రాష్ట్ర తెలుగుదేశంపార్టీ వడ్డీ సాధికారిక కన్వీనర్ బలే ఏసురాజు, జనసేన నాయకులు కొల్లిబాబి, పూలా రాజీ, జయమంగళ సుబ్బరాజు ఉన్నారు.

తెరిపివ్వని వర్షాలు

ఏలూరుసిటీ : బంగాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో జిల్లాలో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఈనెల 5తేదీన మధ్య బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ఏర్పడుతుందని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా ఆగిరిపల్లి మండలంలో 70.6 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 29.2 మి.మీ నమోదైంది. కైకలూరు 62.6, కొయ్యలగూడెం 53.6, పెదపాడు 49.4, దెందులూరు 46.2, కలిదిండి 45.8, మండవల్లి 44.6, పెదవేగి 39.4, ఏలూరు రూరల్ 35, చాట్రాయి 34.2, బుట్టాయిగూడెం 34.2, ముదినేపల్లి 31.4, ముసునూరు 26.2, నూజివీడు 23.4, భీమడోలు 20, ఉంగుటూరు 17.6, నిడమర్రు 15.2, జంగారెడ్డిగూడెం 13.4, వేలేరుపాడు 11, చింతలపూడి 10.4, కామవరపుకోట 8.8, టి.నరసాపురం 8, జీలుగుమిల్లి 7.4, ద్వారకా తిరుమల 6.4, కుక్కునూరు 3.4 మి.మీ వర్షపాతం నమోదైంది.



మండవల్లి మండలం చినఎడ్లగాడి వద్ద రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తున్న కొల్లేరు



గోదావరి.. దూకుడు!

కుక్కునూరు తీర ప్రాంతంలో గోదావరి ఉధృతి

బిక్కుబిక్కుమంటున్న ముంపు మండలాలు

- సురక్షిత ప్రాంతాలకు ప్రజల తరలింపు యత్నాలు
- రెండు నెలలకే మళ్లీ టెన్షన్
- ఏజెన్సీలో పొంగుతున్న కొండవాగులు
- కొల్లేరుకు పోటెత్తిన వరద
- ముంపు భయంలో లంక గ్రామాలు

అంతకంతకు గోదావరి తరుము కొస్తోంది. భద్రాచలం వద్ద గంట గంటకు నీటి మట్టం పెరుగుతూ బుధవారం మధ్యాహ్నం నాటికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే స్థాయికి చేరింది. గురువారం నాటికి రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. పరిస్థితిని యంత్రాంగం అంచనా వేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రంగం సిద్ధం చేసింది. ఏజెన్సీలో కొండవాగులు దూసు కొస్తున్నాయి. కొల్లేరులోను వరద పోటెత్తింది. రాబోయే 24 గంటల్లో భారీ వర్షాలకు అవకాశం ఉండడంతో అంతా ఆందోళనలో ఉన్నారు.

– ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి



కేఆర్‌పురం తూర్పు కాల్వ వరద ఉధృతి



రెడ్డిగణపవరం సమీపంలో జల్లేరు కొండవాగు..



నీటమునిగిన వేలేరుపాడు-రుద్రమ్మకోట రహదారి

పట్టుమని రెండు నెలలు గడవకమునుపే..

సరిగ్గా రెండు నెలల క్రితం ఇదే సమయంలో గోదావరి పోటెత్తింది. భద్రాచలం వద్ద అనూహ్యంగా పెరిగి రెండురోజుల వ్యవధిలోనే వరద ఉధృతంగా దూసుకొచ్చింది. ముంపు మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడులలో పరిస్థితి దీనావస్థకు చేర్చింది. తిరిగి మళ్ళీ ఊళ్ళ మీద పడే దిశగా వరద ఉధృతి మరింత పెరుగుతోంది. ఈ రెండు ముంపు మండలాల్లోను ఒకవైపు గోదావరి, మరోవైపు వాగులు, వంకలు రోడ్డు మార్గాలను ఇప్పటికే చిన్నాభిన్నం చేశాయి. పెదవాగు పొంగి ప్రవహించడంతో ఆఖరుకి ప్రాజెక్టు అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోగా మిగిల్చిన నష్టం ఇంకా మరువకముందే మళ్ళీ భారీ వర్షాల తాకిడికి వరద కమ్ముకొస్తూనే ఉంది. ఇప్పటికే వేలేరుపాడు, కుక్కునూరు రెండు మండలాల్లోను జన జీవనం అస్తవ్యస్తంగానే మారింది. సరైన మార్గం లేక, రోజువారి అవసరాలు తీరక జనం పడే అవస్థలు అన్నీఇన్నీకావు. ఈ నేపథ్యంలోనే అధికారులు గిరిజనులు, గిరిజనేతరులను వరద ముంచుకు రాకముందే సురక్షిత ప్రాంతాలకు తరలిరావాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు. కాని వరదలన్నా, నీరన్నా భయంలేని అనేక మంది ఎప్పటికప్పుడు ఎదురయ్యే పరిస్థితులను తేలిగ్గానే తీసుకుంటున్నా ఇంకోవైపు రోజువారి కష్టాలు మాత్రం వీరిని వీడడంలేదు. వాస్తవానికి ఆగస్టు పూర్తయ్యే నాటికి గోదావరి వరదలు తగ్గుముఖం పడతాయని ఇప్పటి వరకు స్థానికులు ధీమాగా ఉన్నారు. కాని వారి ధీమాను పటాపంచలు చేస్తూ సెప్టెంబరు మొదటి వారంలోను గోదావరి వరద కమ్ముకొస్తుండడంతో వీరంతా విలవిలలాడుతున్నారు. మండలంలో స్పెషల్ అధికారులను రంగంలోకి దింపారు. గోదావరికి రెండో ప్రమాద హెచ్చరిక అతి చేరువలో ఉండడంతో తక్షణ సహాయ చర్యలకు వీలుగా సహాయ శిబిరాల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారు. గడిచిన రెండునెలల క్రితం ముంచెత్తిన వరదలతో దాదాపు 25 గ్రామాలు విలవిలలాడగా ఈసారి కూడా ఆయా గ్రామాలన్నింటినీ మరింత అప్రమత్తం చేశారు. వరద నుంచి కాపాడేందుకు తక్షణం రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేలా అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. మరోవైపు పోలవరం మండలంలోని కొవ్వాడ కాల్వ నీరు ఉధృతంగా ప్రవహిస్తూ గోదావరిలో కలుస్తోంది. పట్టిసీమ క్షేత్రంలో భారీగా వరద చేరింది.

వరద నీటితో కొల్లేరు ఉరకలు

కొల్లేరు సరస్సు వరద నీటితో ఉరకలేస్తోంది. ఈ మధ్యకాలంలో ఎన్నడూ లేని విధంగా అటు బుడమేరు నుంచి, ఇటు రామిలేరు, తమ్మిలేరు నుంచి భారీ ఎత్తున వరద కొల్లేరుకు చేరుతోంది. మూడో కంటికి తెలియకుండా కొల్లేరులో కొందరు కొంత భూమిని ఆక్రమించి చెరువులు తవ్వారు. ఇప్పుడు అవే అతి పెద్ద తప్పిదంగా మరోసారి మారబోతుంది. ఇంకోవైపు బుడమేరులో వరద తగ్గినట్టే తగ్గి మళ్ళీ పెరుగుతుండడం, ఇంకోవైపు భారీ వర్షాల సంకేతాలు జారీకావడంతో ఇప్పటికే కొల్లేరులో ఉన్న నీటి నిల్వ మరింత పెరిగే అవకాశం ఉంది. పలు లంకలను చుట్టిముట్టి రాకపోకలు స్తంభించే ప్రమాదం పొంచి ఉంది. పెదఎడ్లగాడి, చినఎడ్లగాడి వద్ద కొల్లేరు నుంచి వరద ఉధృతంగా ఉప్పుటేరులోకి చేరుతుంది. నాలుగేళ్ల క్రితం నాటి వరద ఈసారి కూడా కళ్ళకు కట్టినట్టుగా ఏలూరు-కైకలూరు మార్గం మీద రోడ్డుపైకి చేరింది. ఇప్పటికే మిగిలిన వాగుల నుంచి వరద కొల్లేరువైపు వస్తుండడంతో రాబోయే 24 గంటల్లోనే మరిన్ని లంక గ్రామాలకు వెళ్ళే మార్గాలన్నీ ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. కైకలూరు మండలం ఆటపాక పక్షుల కేంద్రం ముంపునకు గురయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. పక్షుల కేంద్రానికి ఆనుకొని ఉన్న పోల్‌రాజ్ డ్రెయిన్ ఉధృతంగా ప్రవహిస్తూ కొల్లేరులో కలుస్తోంది. పందిరిపల్లిగూడెంలోని సర్కారు కాల్వ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కొల్లేరు గ్రామాల ప్రజల్లో ఆందోళన నెలకొంది.



పెదఎడ్లగాడి వంతెన వద్ద కొల్లేరులోని గుర్రపుడెక్కను తొలగిస్తున్న దృశ్యం

ఎందుకీ వైపరీత్యం

ఇప్పటికే ఖరీఫ్ సీజన్ అంతంత మాత్రంగా ప్రారంభమైన తరుణంలోనే ఇంకోవైపు భారీ వర్షాలు, వరదలు ముంచెత్తడంతో రైతులు విలవిలలాడుతున్నారు. పోలవరం వద్ద కడెమ్మ స్లూయిజ్ నుంచి కొండవాగుల నీరు ఉధృతంగా గోదావరిలోకి ప్రవహిస్తోంది. రామిలేరు పరిసర ప్రాంతాల్లో కూడా రైతులు ఇప్పటికే భయం గుప్పెట్లో ఉన్నారు. దీనికి తోడు బుడమేరు ప్రభావం కృష్ణ కాల్వ మీద కూడా పడింది. ఇప్పటికిప్పుడు కృష్ణకాలువకు పెద్ద ప్రమాదం ఏమీలేదని అధికారులు చెబుతున్నా భారీ వర్షాలు పునరావృతమైతే మాత్రం పంటకునష్టం తప్పదని రైతులు భయపడుతున్నారు. అందుకనే కృష్ణా కాల్వ పరీవాహకంలో తాజా పరిస్థితిని అధికారులు పరిగణనలోకి తీసుకుంటున్నారు. బుడమేరు పెరుగుతుండడమే దీనికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు. తమ్మిలేరులో నీటి ప్రవాహం కొంత తగ్గినట్టే తగ్గి బుధవారం సాయంత్రం నాటికి మళ్ళీ పుంజుకుంది. ఏలూరు తూర్పు లాకులు, పడమర లాకుల వద్ద తమ్మిలేరు దూకుడుగా ఉంది.



పోలవరం స్పిల్‌వే వద్ద వరద గోదావరి

శిబిరాలకు తరలిరండి : జేసీ

కుక్కునూరు/వేలేరుపాడు/బుట్టాయగూడెం : భద్రాచలం వద్ద బుధవారం రాత్రికి 44.3 అడుగులకు గోదావరి నీటి మట్టం చేరడంతో తెలంగాణ అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. తెలంగాణ ఎగువన ప్రాజెక్టులన్ని నిండి ఉండడంతో కిందికి నీటిని విడుదల చేయడంతో గోదావరి నెమ్మదిగా పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో జేసీ ధాత్రిరెడ్డి మండలంలో ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న గొమ్ముగూడెంలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. వరద రాకముందే పునరావాస శిబిరాలకు తరలి వెళ్లడానికి సిద్ధంగా ఉండాలని గ్రామస్థులకు సూచించారు. అనంతరం దాచారం పునరావాస కాలనీకి వెళ్లి ఏర్పాట్లు పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ప్రత్యేకాధికారి బాబ్జీ, తహసీల్దార్ పెద్దిరాజు, ఎంపీడీవో నరసింహారావు ఇతర అధికారులు పాల్గొన్నారు. వేలేరుపాడు మండ లంలో వేలేరుపాడు, రుద్రమ్మకోట మధ్య రహదారిపైకి వరద చేరుకుంది. వేలేరుపాడు, కోయిదా రహదారి మధ్య గల ఎద్దువాగు, టేకూరువాగు బ్రిడ్జీల పైకి వరద చేరుకోవడంతో ఈ ప్రాంతాల్లో రాకపోకలు స్తంభించిపోయాయి. అత్యవసర పనులకు ఉపయోగించుకునేలా అధికారులు ఇక్కడ నాటుపడవలను అందుబాటులో ఉంచారు.

పొంగుతున్న కొండవాగులు

పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు ఎడతెరిపిలేకుండా కురిసిన భారీవర్షానికి మన్యంలోని కొండవాగులు ప్రమాదకరస్థాయిలో పొంగి ప్రవహించాయి.బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం-వీరన్నపాలెం మధ్య ఉన్న జల్లేరు కొండవాగులు, కేఆర్ పురం తూర్పు కాల్వ, పద్మవారిగూడెం, రాచూరు సమీపంలోని వాగులు ప్రమాదకరంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కుండపోత వర్షానికి వరదనీరు రోడ్లపైనే ప్రవహించడంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. అటవీ ప్రాంతంలోని అధికశాతం కొండరెడ్డి గ్రామాలు విద్యుత్ సరఫరా లేక అంధకారంలోనే ఉన్నాయి. జిల్లా అధికారులు ఆదేశాల మేరకు వాగుల వద్ద పోలీస్, రెవెన్యూ అధికారులు, సిబ్బందిని పహారా ఉంచినట్టు తహసీల్దార్ రమేష్ తెలిపారు.మరోవైపు శ్రీ గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయానికి కొండవాగుల ద్వారా 250 క్యూసెక్కుల వరదనీరు వస్తుండగా ముందు జాగ్రత్త చర్యగా గేట్లు ఎత్తి 300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు ఏఈ తులసీ తెలిపారు.



గొమ్ముగూడెంలో ప్రజలతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

జిల్లాస్థాయి ఉత్తమ గురువులు వీరే..

- నేడు ఏలూరులో గురుపూజోత్సవంలో పురస్కారాల అందజేత

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 4 : గురుపూజోత్సవాన్ని పురస్కరించు కుని జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన టీచర్ల జాబితాను బుధవారం డీఈవో అబ్రహం విడుదల చేశారు. బోధనా రంగంలో విశిష్ట సేవలందిస్తున్న ఉపాధ్యాయులకు పురస్కారాలు ఇంత వరకు అందిస్తుండగా, ఈ ఏడాది నుంచి తొలిసారిగా టెన్త్ ఫలితాల్లో అత్యధిక ఉత్తీర్ణతను సాధించిన హైస్కూళ్లు, విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను అధికంగా సాధించిన పాఠశాలలు, ఎక్కువ పనిదినాలు స్కూలు విధులకు హాజరైన ఉపాధ్యాయులు, జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ పోటీ విజేతకు ఉత్తమ పురస్కారాలు అందజేయాలని నిర్ణయించడం విశేషం. మొత్తం 20 మంది ఉపాధ్యాయులు, వివిధ విభాగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన 11 పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులను జిల్లాస్థాయి అవార్డులకు ఎంపిక చేశారు. ఎంపికైన వారందరూ గురు వారం ఏలూరులోని జడ్పీ మీటింగ్ హాలులో ఉదయం 9.30 గంటలకు నిర్వహించే గురుపూజోత్సవానికి స్కూలు ఐడీ కార్డు, ఇతర ధ్రువపత్రాలతో హాజరు కావాలని డీఈవో సూచించారు.

ఉత్తమ పురస్కారాలు వీరికే..

గ్రేడ్-1 హెచ్‌ఎంల విభాగంలో నారాయణపురం జడ్పీ హైస్కూలు హెచ్‌ఎం షేక్ నాగూర్ మీరా సాహెబ్.

స్కూల్ అసిస్టెంట్ల విభాగంలో.. కె.సోమసుందరం (ఇంగ్లీషు), చీరవల్లి, కుక్కునూరు మండలం, గుజ్జు నాగసుధ, (ఫిజి కల్ ఎడ్యుకేషన్), కైకరం, గొల్లపల్లి రామారావు (సోషల్ స్టడీస్), నారాయణపురం, తాతిన ప్రభాకరరావు(బయోలాజికల్ సైన్స్), సింగగూడెం, బండి వెంకటేశ్వరరావు(బయోలాజికల్ సైన్స్), లక్ష్మీపురం, సీహెచ్.జయరాజు(ఇంగ్లీషు), కొత్తపల్లి, నేతల వెంకటరత్నం (తెలుగు), పెదగొన్నూరు, తాడి వరలక్ష్మి (సోషల్ స్టడీస్), తడికలపూడి.

ఎస్జీటీల విభాగంలో.. జి.సి.ఎస్.వి.ఎస్.కృష్ణారావు, బొర్రంపాలెం ఎంపీపీఎస్-1, కొమ్మోజు వెంకటేశ్వరరావు, కొత్తగూడెం ఎం పీపీఎస్, పోలి రెడ్డి వెంకటరమణ, కూచింపూడి ఎంపీపీఎస్, సీహెచ్.సాల్మన్‌రాజు, కల రాయనగూడెం ఎంపీపీఎస్, రాయపూడి వెంకటరమణ, కుంటాలగూడెం ఎంపీయూపీఎస్, వి.రామోజీరావు, గోనెపాడు ఎంపీపీఎస్, కైకలూరు, కారే పరమానందం, భీమడోలు ఎంపీపీఎస్, పి.బేబిసారమ్మ, తక్కెళ్ళ పాడు ఎంపీపీఎస్, సీహెచ్. పిచ్చోడు, ఏ.ఆర్.వరం (మండవల్లి) ఎంపీపీఎస్., వహీదాబేగం, ఎంపీపీఎస్ ఉర్దూస్కూలు, శనివారపుపేట., కె.మంజుల, కొమడ్రు ఎంపీపీఎస్-1, గణపవరం.

'పది'లో నూరుశాతం (2023-24) ఉత్తీర్ణత స్కూళ్ల విభాగంలో..

ప్రిన్సిపాల్, ఏపీఆర్‌జీహెచ్‌ఎస్, నాగిరెడ్డిగూడెం, ప్రిన్సిపాల్, ఏపీ రెసిడెన్షియల్ బాలుర హైస్కూలు, అప్పలరాజుగూడెం, ప్రిన్సిపాల్, కేజీబీవీ, వేలేరుపాడు, గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయిని, జడ్పీ హైస్కూలు, వీరమ్మకుంట, హెచ్‌ఎం, గిరిజన ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ హైస్కూలు, లంకాలపల్లి, బుట్టాయిగూడెం.

ఎన్‌రోల్‌మెంట్ పెరుగుదలలో ఉత్తమ పనితీరు (2023-25) విభాగంలో...

హెచ్‌ఎం, కె.పి.డి.టి.హైస్కూలు, ఏలూరు (143 మంది విద్యార్థులకు కొత్తగా అడ్మిషన్లు), గ్రేడ్-2 హెచ్‌ఎం, జడ్పీ హైస్కూలు, కామవరపుకోట (82), గ్రేడ్-2 హెచ్‌ఎం, జడ్పీ హైస్కూలు, ఆగిరిపల్లి (53).

అలాగే గత విద్యాసంవత్సరం (2023-24)లో స్కూలు పనిదినాల్లో నూరుశాతం (218/218) విధులకు హాజరైనందుకుగాను గంగన్న గూడెం ఎంపీయూపీ స్కూలు టీచరు తుమ్మిడి మురళీ మోహన రావు ఉత్తమ పురస్కారానికి ఎంపికయ్యారు. అలాగే జాతీయ స్థాయిలో అసోంలో 2023లో నిర్వహించిన 'ఇన్‌స్పైర్ సైన్స్ ప్రదర్శనలో విజేతగా నిలిచిన కలిదిండి మండలం, కోరుకొల్లు జడ్పీ హైస్కూలు బయోలాజికల్ సైన్స్ టీచరు మెడెం రామకృష్ణ అవార్డుకి ఎంపికయ్యారు.

పారిశుధ్య నిర్వహణలో జిల్లా ఫస్ట్

- డీపీవో శ్రీనివాస విశ్వనాథ్‌ను అభినందించిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

ఏలూరు సిటీ, సెప్టెంబరు 4 : పారిశుధ్య నిర్వహణలో రాష్ట్ర స్థాయిలో ఇచ్చిన ర్యాంకుల ప్రకారం ఏలూరు జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానాన్ని సాధించింది. ప్రధానంగా పారిశుధ్య నిర్వహణకు సంబంధించి పలు అంశాలును పరిగణలోకి తీసుకుని ర్యాంకింగ్‌లు ఇచ్చారు. జిల్లాలో 1233 ట్యాంక్‌ల క్లీనింగ్‌కు గాను 1,196 క్లీనింగ్ చేసి 97 శాతం ప్రగతిని జిల్లా సాధించింది. క్లోరినేషన్ విషయంలో జిల్లాలో 1271 ట్యాంకులకు 1264 ట్యాంకులలో క్లీనింగ్ చేసి 99.45 శాతం ప్రగతి సాధించింది. బహిరంగ ప్రదేశాల్లో చెత్తా చెదారం క్లీన్ చేయడడంలో 100 శాతం ప్రగతి సాధించింది. పొదలు తొలగింపు విషయంలో 1097 ప్రదేశాలకు 1094 ప్రదేశాల్లో చేసినందుకు 99.73 శాతం, మురుగు కాల్వల్లో పూడిక తీతకు సంబంధించి 97.34 శాతం, లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వలను తొలగించడంలో 99.60 శాతం ప్రగతి సాధించి ప్రభుత్వం ఇచ్చిన ఆరు టాస్క్‌లలో ఓవర్‌ఆల్‌గా 99.13 శాతం ప్రగత సాధించి రాష్ట్రంలో జిల్లా పారిశుధ్య నిర్వహణలో ప్రథమ స్థానం సాధించింది. అన్నమయ్య జిల్లా ద్వితీయ స్థానం సాధించగా, వైఎస్ఆర్ కడప జిల్లా తృతీయ స్థానాలు సాధించాయి. పారిశుధ్య నిర్వహణలో ఏలూరు జిల్లా ప్రథమ స్థానం సాధించినందుకుగాను జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్‌ను బుధవారం జరిగిన రాష్ట్ర స్థాయి టెలీకాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ అభినందించారు. గ్రామాల్లో మురుగుకాల్వల నిర్వహణ, తాగునీరు, ట్యాంకులు శుభ్రపరచడం, పంచాయతీ చెరువుల్లో గుర్రపుడెక్క తొలగించడం, గ్రామాల్లో చెత్త కుప్పలు లేకుండా చేయడం, పైప్‌లైన్లు సరిజేసి స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు అందించడం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని జిల్లాలకు పారిశుధ్య నిర్వహణపై ర్యాంకింగ్‌లు ఇచ్చారు. రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు పారిశుధ్య కార్యక్రమాలు పర్యవేక్షించడానికి ప్రభుత్వం పీఆర్ వన్ యాప్ అభివృద్ధి చేశారు. పారిశుధ్య నిర్వహణకు సంబంధించి పంచాయతీ సిబ్బంది ఫొటోస్ తీసి యాప్‌లో అప్‌లోడ్ చేసి, పారిశుధ్య కార్యక్రమాలు చేసిన ఫొటోస్‌ను తిరిగి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. డీపీవో శ్రీనివాస విశ్వనాథ్ క్షేత్రస్థాయి తనిఖీలు , టెలీకాన్ఫరెన్స్‌లు నిర్వహించి సిబ్బందిని అప్రమత్తం చేయడం, నిర్లక్ష్యం వహిస్తున్న పంచాయతీ సిబ్బందిపై చర్యలకు ఉపక్రమించడం , సకాలంలో తాగునీటి పరీక్షలు, క్లోరినేషన్ చేయించడం, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ద్వారా టైం లైన్ పెట్టి నిరంతర పర్యవేక్షణ చేయడం, పారిశుధ్య కార్మికుల నిస్వార్థ సేవలు, సిబ్బంది సహకారం వల్ల జిల్లా పారిశుధ్య నిర్వహణలో ప్రథమ స్థానంలో నిలిచిందని చెబుతున్నారు. దీని వల్ల గ్రామీణ ప్రాంత ప్రజలు డయేరియా , మలేరియా, డెంగీ, చికెన్‌గునియా తదితర వ్యాధుల బారిన పడకుండా నివారిస్తున్న చర్యలు , ముఖ్యంగా జిల్లా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి గ్రామాల్లో ఉన్న ఓహెచ్‌ఆర్ ట్యాంకు ప్రధాన వాల్స్ ఛాంబర్స్‌లో నిల్వ ఉన్న కలుషిత వర్షపు నీటిని తొలగించి తాగునీరు సరఫరా చేయడం పవన్ కల్యాణ్ దృష్టిని ఆకర్షించింది. స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి ఏలూరు జిల్లా చేపడుతున్న చర్యలను రాష్ట్రంలోని అన్ని జిల్లాలు అమలు చేయాలని ఆయన సూచించారు. జిల్లా ప్రథమ స్థానం సాధించినందుకు మంత్రి పార్థసారథి, కలెక్టర్ వెట్రిసెల్విలు డీపీవో విశ్వనాథ్‌ను అభినందించారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి, మంత్రి పార్థసారథి

దాతలు ముందుకు రావాలి

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు4: వరద బాధితులను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధిలు అన్నారు. ఏలూరులో దాతల నుంచి సేకరించిన దుప్పట్లు, టవల్స్‌ను విజయవాడకు తీసుకెళ్ళి 15వ డివిజన్ పోలీస్‌కాలనీలో పంపిణీ చేశారు. ఎవరు ఆధైర్యపడవద్దని, కూటమి ప్రభుత్వం బాధితులను ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.

బాధితులకు ఆహారం పంపిణీ



ఆహారం అందిస్తున్న ఆరిమిల్లి

తణుకు, సెప్టెంబరు 4: విజయ వాడలోని వరద బాధితులకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధా కృష్ణ 5 వేల టమాటా రైసు ప్యాకెట్లును బుధవారం పంపిణీ చేశారు. వీటితో పాటు పాలు. బ్రెడ్‌లు, వాటర్ బాటిళ్ళను పంపిణీ చేశారు. తణుకు నుంచి టీడీపీ నాయకులు తాతపూడి మారుతీరావు, ఒమ్మి రాంబాబు, మేడికొండ రామకృష్ణ శివరావు వెళ్ళారు. కటకం రామకృష్ణ ఆధ్వర్యంలో పులిహోర, వాటర్ బాటిల్స్ కూరగాయలు, బిస్కెట్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

ఏ సాయానికైనా సిద్ధం : ఎమ్మెల్యే బొలిశెట్టి



తాడేపల్లిగూడెం అర్బన్: వరద బాధితుల కోసం ఏ సాయం చేయడాని కైనా తాము సిద్ధంగా ఉంటామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ముఖ్యమంత్రి చంద్ర బాబుతో అన్నారు. విజయవాడ కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం నుంచి ఇప్పటికే సుమారు లక్ష ఆహార ప్యాకెట్లు, వివిధ స్వచ్ఛంధ సంస్థల నుంచి వాటర్‌బాటిల్స్, బిస్కెట్ ప్యాకెట్స్, బ్రెడ్స్ సిద్ధం చేస్తున్నామన్నారు.

దుప్పట్లు పంపిణీ



నిడమర్రు : పత్తేపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పొత్తూరి నరసింహరాజు తన అనుయాయులతో కలసి విజయవాడ 54, 55, 56 డివిజన్లు, సింగ్‌నగర్‌లలో బాధితులకు వాటర్ బాటిల్స్ ఆహార పొట్లాలు, పంపిణీ చేశారు. బుధ వారం దుప్పట్లు, పంచెలు, చీరలు పంపిణీ చేశారు. చానమిల్లి, అడవి కొలను గ్రామాల నుంచి టీడీపీ ఆధ్వర్యంలో సుమారు 5 వేల ఆహార పొట్లాలు పంపారు.

విజయవాడకు పారిశుధ్య కార్మికులు

ఏలూరు టూటౌన్ : విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాలకు పారిశుధ్య కార్మికులను 130 మందిని పంపిస్తున్నట్లు కమిషనర్ ఏ.భానుప్రతాప్ తెలిపారు. ఇంతకు ముందు 150 మంది వర్కర్లను 20 మంది సచివాలయ సెక్రటరీలను పంపించినట్లు ఎంహెచ్‌వో డాక్టర్ మాలతి తెలిపారు.



పెనుగొండ వాసవీ క్షేత్రంలో సిద్ధం చేస్తున్న పులిహోర ప్యాకెట్లు



తెల్లవారుజామున దగ్గరుండి ఆహారం సిద్ధం చేయిస్తున్న చింతమనేని

బాధితులకు అండగా

విజయవాడ వరద బాధితులకు సహాయం చేసేందుకు రాజకీయ నాయకులు, వ్యాపారులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఇలా ప్రతీ ఒక్కరూ మేమున్నామంటూ ముందుకు వస్తున్నారు. ఆహారం, వాటర్ ప్యాకెట్లతో పాటు నిత్యావసర వస్తువులు, దుప్పట్లు అందిస్తున్నారు.

భీమవరం టౌన్, సెప్టెంబరు 4: జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పర్యవేక్షణలో బుధవారం పెద్ద ఎత్తున వేలాది ఆహార పదార్థాలు, వాటర్ బాటిల్స విజయవాడకు పంపించారు. జనసేన పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ యిర్రింకి సూర్యారావు ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు ఐదు వేల బిర్యాని ప్యాకెట్లు,ఐదు వేల దుప్పట్లు అందించారు. ఎమ్మెల్యే రామాంజనేయులు వాహనానికి జెండా ఊపి ప్రారంభించారు. భీమవరం ఆక్వా డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2వేల ఆహార పదార్థాలను కలెక్టర్ , ఎమ్మెల్యే జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ప్రారం భించారు. వీరవాసరం మండలం నవుడూరు గ్రామానికి చెందిన అడబాల నారాయణరావు 5 వేల మందికి భోజనం, వాటర్ ప్యాకెట్లు తరలించారు. జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులు నుంచి సుమారు 5 వేల భోజనం ప్యాకెట్లు పంపారు. భీమవరం లయన్స్‌క్లబ్ తర ఫున 3 వేల మందికి భోజనం ప్యాకెట్స్‌ను పంపించారు. సీహెచ్ కృష్ణంరాజు అందించిన రూ.2 లక్షలతో వీటిని తయారు చేశారు.భీమవరం డీఎన్ఆర్ కాలేజ్ విద్యాసంస్థలు డిగ్రీ, పాలిటెక్నిక్, బీటెక్ విద్యార్థులు ఐదు వేల ఆహార పొట్లాలు తయారు చేయించి పంపారు.

ఆకివీడు : ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణరాజు ఆర్థిక సహకారంతో బుధవారం 12 వేల ఆహార పొట్లాలు, వెయ్యి వాటర్ బాటిల్స్ మూడు వాహనాలలో పంపించారు. ఆదర్శ లయన్స్ క్లబ్, ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఆహార పొట్లాలు పంపించారు.

కాళ్ళ: దొడ్డనపూడి సర్పంచ్ కొల్లి సుబ్బారావు, బీజేపీ ఉండి ఇన్‌చార్జి కోరా రామ్మూర్తి, సీసలి మాజీ సర్పంచ్ కప్పిరెడ్డి శ్రీనివాసరావు, సీసలి జన సేన గ్రామాధ్యక్షుడు నూకల భోగేంద్రబాబు సహకారంతో ఏర్పాటు చేసిన సుమారు 5 వేలు ఆహార పొట్లాలు, ఐదువేల వాటర్ బాటిల్స్‌ను బుధ వారం ప్రత్యేక వ్యాన్‌లో విజయవాడకు పంపించారు.

ఉండి : పెదపుల్లేరు గ్రామస్థుల ఆధ్వర్యంలో 6 వేల ఆహార పొట్లాలను పంపించారు. స్థానికులు పలువురు తరలివెళ్లారు. తహసీల్దారు నాగార్జున జెండాను ఊపి పంపించారు.

పాలకొల్లు రూరల్ : పాలకొల్లు జైభారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం తరపున 2 వేలు, కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ క్లబ్ తరపున 3 వేల ఆహార పొట్లాలను, సంధ్యా మెరైన్స్ నుంచి 5 వేల ఆహార పొట్లాలు, విజయవాడకు వ్యాన్లలో పంపించారు.

నరసాపురం టౌన్ : కష్టకాలంలో ఉన్న వరద బాధితులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఎమ్మెల్యే నాయకర్ పిలుపునిచ్చారు. బుధ వారం రాత్రి వరద బాధితుల కోసం 20 లక్షలు విలువ చేసే 12 వేలు నిత్యావసర ప్యాకెట్లను సిద్ధం చేసి వాటిని వాహనంలో విజయవాడ తరలించారు. ఒక్కొక్క ప్యాకెట్‌లో ఐదు కేజీల బియ్యం, ఒక పాలు, బెడ్, ఇతర నిత్యవసరా వస్తువులు ఉన్నాయి. మండలంలోని కొప్పర్రు గ్రామానికి చెందిన జనసేన నాయకులు పోలిశెట్టి శ్రీనివాస్ విజయవాడ వరద బాధితులకు తనవంతు సాయంగా 1000 భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. డీఆర్‌డీపీ సహకారంతో వీటిని వ్యాన్ సాయంతో తరలించారు.

పెనుగొండ : పెనుగొండ శ్రీవాసవీ టెంపుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 2500 పులిహోర ప్యాకెట్లును , 2500 వాటర్ ప్యాకెట్లును పంపిణీ చేసినట్లు ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ గోవిందరాజులు తెలిపారు.

ఏలూరు టూటౌన్ : ఏలూరు అన్ ఎయిడెడ్ పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.లక్షా 50 వేల విలువైన ఆహార పదార్థాలను విజయవాడ తరలించినట్లు అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శర్మ తెలిపారు. నగర పాలక సిబ్బంది, డ్వాక్రా మహిళలు ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారని ఎస్ఎంఎస్ అంబు లెన్స్ సర్వీస్ ద్వారా 5వేల మందికి ఆహార పొట్లాలు పంపినట్లు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. ఏపీఎన్ జీఓస్ అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాసరావు, నెరుసు రామారావు 5వేల మందికి సరిపడ బ్రెడ్, వాటర్‌బాటిల్స్ పంపామన్నారు. శ్రీసత్యసాయి సేవా కేంద్రం ఆధ్వర్యంలో 5 వేల వాటర్ బాటిల్స్‌ను, బ్రెడ్ పంపించారు.

ఏలూరు కార్పొరేషన్ : ఏలూరు ఆర్డీవో ఎస్.కె.ఖాజావలి, తహశీల్దార్ జి.వి.శేషగిరిరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనునాయక్, వీఆర్వోల బృందం లారీపై ఆహార పదార్థాలు, మంచినీటి బాటిల్స్, పాలు ప్యాకెట్లు, బిస్కెట్ ప్యాకెట్లతో తరలివెళ్ళారు.

ఏలూరు రూరల్ : ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ వారికి ఇచ్చిన విరాళాల సహాయనిధి నుంచి ఫుడ్ ప్యాకెట్లు, వాటర్‌ప్యాకెట్ల వాహనాన్ని ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాసరావు, ఏలూరు మున్సిపల్ కమిషనర్ ఏ.భానుప్రతాప్ ప్రారంభించారు.

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమలలో టీడీపీ నాయకుడు ఇమ్మడి రత్నాజీ ఆధ్వర్యంలో 4 వేల ఆహార పొట్లాలను, పంపించారు. గుడి సెంటర్‌లో ఉన్న వ్యాపారులు 40 వేల వాటర్ ప్యాకెట్లను పంపారు. శ్రీవారి దేవస్థానం 5,500 సాంబార్ రైస్‌ప్యాకెట్లు, 6 వేల వాటర్‌ప్యాకెట్లు పంపించారు.

చింతలపూడి : చింతలపూడి మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన స్ఫూర్తి స్వచ్ఛంధ సంస్థ కార్యదర్శి మొహిద్దీన్ పాషా వెయ్యి ఆహార పొట్లాలను తహసీల్దార్ ప్రమధ్వర ఆధ్వర్యంలో పంపారు.

ఉంగుటూరు : కైకరం నుంచి జనసేన తరఫున రూ.3.30 లక్షలతో తయారు చేసిన ఆహార పొట్లాలను పంపించారు. రెండు టన్నుల బియ్యం, 2 టన్నుల కూరగాయలు, టన్ను ఉప్మా రవ్వ, టన్ను చపాతి పిండి, టన్ను బత్తాయిలు, పంపారు.



ఎమ్మెల్యేలకు విరాళం అందిస్తున్న దాతలు

దాతల విరాళాలు

నరసాపురం : వరద బాధితుల సహాయార్థం నరసాపురం ఐఎంఐ, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.లక్ష చెక్కు. సంఘం నాయకులు డాక్టర్ కోటేశ్వరరావు, నర్సింహరావు, మూర్తిలు బుధవారం ఎమ్మెల్యే నాయకర్‌కు అందించారు.



భీమవరం టౌన్ : కృష్ణ బలిజ టీడీపీ బీసీ రాష్ట్ర సాధికారిత కమిటీ సభ్యులు గంటా త్రిమూర్తులు ఆధ్వ ర్యంలో రూ.75 వేలు ఎమ్మెల్యే అంజిబాబుకు అంది ంచారు. జిల్లా ముఖ్య ప్రణాళిక కార్యా లయం అధికారులు, సిబ్బంది జిల్లా కలెక్టర్‌ను కలిసి వరద బాధితుల సహాయార్థం రూ.1.21 లక్షలు చెక్కును సీపీవో ఎం.మోహన్ రావు చేతుల మీదుగా అందజేశారు. ఉండి మండలం కలిగొట్ల గ్రామం నివాసి హైదరాబాదు ఐఐసీటీలో పనిచేస్తూ రిటైర్డు అయిన విశ్రాంత ఉద్యోగి సాగి రాజు వెంకట సత్యనారాయణ రాజు దాచుకున్న సేవింగ్స్ నుంచి రూ.50 వేల చెక్కును జిల్లా కలెక్టర్ చాంబర్‌లో అందజేశారు. పట్టణానికి చెందిన న్యాయవాది తాడిమళ్ళ గిరి రూ.50 వేల విరాళం చెక్కు అందజేశారు.



నరసాపురంలో బియ్యం ప్యాక్ చేస్తున్న జన సేవకులు

భీమడోలు : పూళ్ళ ఎంఎంపురం గ్రామాల్లోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఐదు వేల బిర్యానీ ప్యాకెట్లు, 10 వేల వాటర్ ప్యాకెట్ల తరలించారు.

కామవరపుకోట : ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌ల సూచనతో కామవరపుకోట నియోజక వర్గానికి చెందిన కూటమి నాయకుల బృందం బుధవారం వివిధ వాహనాల్లో బిస్కెట్ ప్యాకెట్లు, మంచినీరు, ఆహార పదార్థాలను తీసుకువెళ్ళారు.

పెదవేగి : వరదలకు అల్లాడుతున్న ప్రజల అవసరాలను తీర్చడమే మనందరి ప్రథమ కర్తవ్యం కావాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దెందులూరు నియోజకవర్గం నుంచి 50 వేల మందికి ఆహారాన్ని సిద్ధం చేసి విజయవాడ తీసుకెళ్ళి బాధితులకు అందించారు. ఏడు పదుల వయస్సులో చంద్రబాబునాయుడు యువకుడిలా పనిచేస్తుంటే ఒక్క పులిహోర పొట్లం కూడా పంచడం చేతకాని జగన్ కూటమి ప్రభుత్వం చేస్తున్న సేవలపై వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటన్నారు.నీచరాజకీయాలు చేయడం ఒక్క జగన్‌కే చెల్లుతుందని విమర్శించారు. ఇకపై ఆహారం కాకుండా ఆహార వస్తువులను అందించే దిశగా స్పందించాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మాగంటి నారాయణ ప్రసాద్, జాస్తి ప్రసాద్, లావేటి శ్రీనివాసరావు, నంబూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ద్వారకాతిరుమల నుంచి జెండా ఊపి వ్యాన్ పంపిస్తున్న ఎస్సై సుధీర్



పాలకొల్లు కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆహారం తరలింపు



ఆహార పదార్థాలను పంపుతున్న జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్



ఆకివీడు నుంచి ఆహార పొట్లాలతో వెళుతున్న వాహనం

306 మంది సర్‌ప్లస్ టీచర్లకు 'సర్దుబాట్లు' నుంచి ఉపశమనం

రేపు నూతన స్థానాల్లో విధుల్లో చేరేందుకు నియామకపత్రాల జారీ

జిల్లాలో ముగిసిన వర్క్ అడ్జస్ట్‌మెంట్ కౌన్సెలింగ్

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 4 : సుదీర్ఘంగా సాగిన సర్‌ప్లస్ టీచర్ల వర్క్ అడ్జస్టమెంట్ కౌన్సెలింగ్ బుధవారంతో ముగిసింది. తుదివిడతగా జిల్లాలోని 28 మండలాల్లో సర్‌ప్లస్ ఎస్జీటీలుగా వున్న 200 మందిని అదే మండలపరిధిలో కొరతవున్న పాఠశాలలకు సర్దుబాటు చేసేందుకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో 160 మంది ఎస్జీటీలు అదే కేడర్‌లోని వెకెన్సీలను కోరుకోగా, ఇంకా మిగిలిపోయిన 40 మందిని ప్రస్తుత స్థానాలకే వెనక్కి పంపివేశారు. ఆ ప్రకారం ఏలూరు జిల్లాలో మొత్తం 805 మంది ఉపాధ్యాయులను సర్‌ప్లస్ టీచర్లుగా గుర్తించిన విషయం విధితమే. జిల్లాలో మొత్తం 499 స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ వేకెన్సీలను ఆయా మండలాల్లోని పాఠశాలల్లో గుర్తించి సర్దుబాట్లు చేపట్టగా, హిందీ, బయోలాజికల్ సైన్స్, ఇంగ్లీషు సబ్జెక్టుల్లో తగినంతమంది అర్హులు లేక 420 వేకెన్సీలను మాత్రమే ఆయా కేడర్లలో భర్తీ చేయగలిగారు. తొలుత స్కూల్ అసిస్టెంట్లకు మండల, డివిజన్ స్థాయిల్లో కౌన్సెలింగ్ నిర్వహించి సర్దుబాట్లు చేశారు. అనంతరం బుధవారం ఒక్కరోజులోనే సర్‌ప్లస్ ఎస్జీటీలందరినీ మండల స్థాయిలో అడ్జస్ట్ చేశారు. కౌన్సెలింగ్ అనంతరం జిల్లాలో మొత్తంమీద వర్క్ అడ్జస్టమెంట్‌కు 805 మంది సర్‌ప్లస్ టీచర్లను గుర్తించినప్పటికీ వివిధ కారణాల వల్ల సుమారు 306 మందిని ప్రస్తుత స్థానాలకే తిరిగి వెనక్కి పంపించి వేయడంతో సంబంధిత ఉపాధ్యాయులందరికీ ప్రయోజనం లభించినట్టయింది. మండల, డివిజన్‌స్థాయి కౌన్సెలింగ్‌లలో నూతన స్థానాలను కోరుకున్న స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలందరూ సంబంధిత స్కూళ్ళలో శుక్రవారం సాయంత్రంలోగా విధుల్లో చేరేందుకు వీలుగా నియామక పత్రాలు కూడా జారీ చేశారు.

ఉండి కేవీకేలో సేంద్రియ వ్యవసాయంపై ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు

ఉండి సెప్టెంబరు 4 :ఉండి కృషి విజ్ఞానకేంద్రంలో సేంద్రియ వ్యవసాయంపై ఆన్‌లైన్ ద్వారా నెలరోజులపాటు సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభించడం జరుగుతుందని ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ మల్లికార్జునరావు తెలిపారు. ఈ కోర్సు వ్యవధి నాలుగు వారాలు వుంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు రూ.1500 ఫీజు చెల్లించి కోర్సుకు పేరును నమోదు చేయించుకోవాలన్నారు. నమోదు చేయించుకున్న అభ్యర్థులకు ఆన్‌లైన్ సదుపాయం కంప్యూటర్, సెల్ ఫోన్ కలిగి వుండాలన్నారు. ఈ సర్టిఫికెట్ కోర్సులు చేయాలనుకునే వారు సెప్టెంబరు 20వ తేదీలోపు పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఈకోర్సుకు సంబంధించి పూర్తి వివరాలు వ్యవసాయ విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ సందర్శించి తెలుసుకోవచ్చుని తెలిపారు. .80087 88776, 83096 26619, 80960 85560. నంబర్లలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు వివరాలు తెలుసు కోవచ్చని మల్లికార్జునరావు తెలిపారు.

అవినీతి నిగ్గు తేలాల్సిందే..

గరగపర్రు పంచాయతీలో ప్రైవేటు వ్యక్తి వ్యవహారం

కార్యదర్శుల తీరుపై గ్రామస్థుల మండిపాటు

పాలకోడేరు, సెప్టెంబరు 4: గరగపర్రు గ్రామ కార్యదర్శుల నిర్వాకంతో ఆ గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. గరగపర్రు గ్రామ పంచాయతీలో ఎటువంటి సంబంధంలేని ప్రైవేటు వ్యక్తి పంచాయతీకి వచ్చి గ్రామ కార్యదర్శులు లేకుండానే పంచాయతీ రికార్డులను సరిచేయడం పట్ల పంచాయతీ బోర్డు సభ్యులు, గ్రామస్థులు ఆ వ్యక్తిని నిర్బంధించి పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనతో పంచాయతీ అవినీతిపై గ్రామంలో చర్చనీయాంశమైంది. అసలు విషయానికి వస్తే గత వైసీపీ పాలనలో గ్రామ పంచాయతీ కార్యదర్శిగా రాజేష్ అనే వ్యక్తి విధులు నిర్వహిస్తూ వచ్చాడు. అతని హయాంలో అదే గ్రామానికి చెందిన ఒక మహిళ చేత ఇంటి పన్నులు వసూలు చేయిస్తూ వస్తున్నాడు. అయితే ఆరునెలల క్రితం రాజేష్ బదిలీపై పాలకొల్లు మండలానికి వెళ్ళిపోయాడు. ఆయన స్థానంలో పెన్నాడ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న లక్ష్మీ గరగపర్రు ఇన్‌ఛార్జ్ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ వరకు బాగానే ఉన్నా మార్చి నెలలో బదిలీపై వెళ్ళిన రాజేష్ ఇన్‌ఛార్జ్ కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్న లక్ష్మికి ఎటువంటి చార్జ్ అప్పగించకుండా బదిలీపై వెళ్ళిపోయాడు. ఇన్‌ఛార్జ్ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మి బాధ్యతలు చేస్తూ వస్తున్నారు. ఆగస్టు నెలలో లక్ష్మి స్థానంలో నూతనంగా గరగపర్రు పంచాయతీ లక్ష్మీప్రశాంతి అనే ఆమె కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్నారు. దీంతోనే ఆ పంచాయతీలో ఉన్న కార్యదర్శుల వ్యవహారం బయటకొచ్చింది.



నూతనంగా బాధ్యతలు తీసుకున్న లక్ష్మీప్రశాంతికి చార్జ్ అప్పగించాలంటే గత వైసీపీ హయాంలో పనిచేసిన కార్యదర్శి రాజేష్ చార్జ్‌ను అప్పగించి తీరాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే రాజేష్ ఓ ప్రైవేటు వ్యక్తిని మంగళవారం గరగపర్రు పంచాయతీలో రికార్డులు సరి చేయమని పంపడంతో ఈ వ్యవహారమంతా బయటకు వచ్చింది. పంచాయతీలో కార్యదర్శుల వ్యవహారంలో అవినీతిని ఉన్నతాధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నిగ్గు తేల్చా లని పంచాయతీ బోర్డు సభ్యులు, గ్రామస్థులు కోరుతున్నారు. మంగళవారం బయటపడిన ప్రైవేటు వ్యక్తి ఉదంతంపై గత పంచాయతీ కార్యదర్శి చేసిన వ్యవహారంలో చాలా అవినీతి జరిగిందంటూ గ్రామస్థులు బాహాటంగా ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారాన్ని పూర్తి స్థాయిలో విచారించి అవినీతికి పాల్పడిన కార్యదర్శులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పంచాయతీ నుంచి బయటకు వెళ్ళి ఆరు, ఏడు నెలలు అవుతున్నా ఛార్జ్ అప్పగించకపోవడం, ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు తీసుకున్న లక్ష్మి కూడా ఇంత కాలం ఆగటం ఏమిటని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.

క్రైం కార్నర్..

భవనం పైనుంచి పడి కార్మికుడు మృతి



ఏలూరు క్రైం, సెప్టెంబరు 4 : తాపీపనికి వెళ్ళిన ఒక కార్మికుడు ప్రమాద వశాత్తు భవనం నుంచిపై పడి మృతి చెందాడు. మృతుడు విజయవాడలోని కృష్ణలంక లేదా గుంటూరులోని కొరటిపాడు ప్రాంతానికి చెందినవాడుగా ప్రాథమికంగా తెలుస్తోంది. ఏలూరు చిరంజీవి బస్టాండ్ ప్రాంతంలో కొన్నేళ్ళుగా ఒంటరిగా నివాసం ఉంటూ తాపీ పనులకు వెళ్తున్నాడు. ఈ నెల 2వ తేదీన రామకృష్ణాపురంలోని ఒక బిల్డింగ్ సెంట్రింగ్ పనులు చేయడానికి వెళ్ళాడు. ప్రమాదవశాత్తు బిల్డింగ్‌పై నుంచి కిందపడి తీవ్ర గాయాలకు గురవ్వగా ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తోటి కార్మికులు తీసుకువెళ్ళగా అప్ప టికే వైద్యులు మృతి చెందారని తెలిపారు. అతని పేరు గోపు వెంకటేశ్వర రావు (60)గా మాత్రమే అందరికి తెలుసు. అతని బంధువులు, స్నేహితులు కూడా ఎవరూ తెలియదు. విజయవాడ కృష్ణలంక, కొరటి పాడులో తన బంధువులు ఉన్నారని చెప్తుండేవారని అన్నారు. మృతుని చిరు నామా తెలిసిన వారు ఏలూరు త్రిటౌన్ పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్ 91548 45553 లేదా 91478 75554 లేదా 915487 5758లకు సమాచారం ఇవ్వాలని ఏలూరు సీఐ ఎస్ కోటేశ్వరరావు కోరారు.

గుళికలు సేవించి ఒకని మృతి

చింతలపూడి, సెప్టెంబరు 4: చింతలపూడి మండలం తమ్మిలేరు రిజర్వాయర్ సమీపంలో గుళికలు తాగి ఒక వ్యక్తి మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. మతుఉడు నగరపంచాయతీ పాత చింతలపూడికి చెందిన ముళ్ళగిరి రవి కుమార్ (33)గా గుర్తించారు. కుటుంబ సభ్యులను పిలిపించి విచారించారు. ఎస్సై కుటుంబరావు తెలిపిన వివరాల ప్రకారం కుటుంబ కలహాల కారణంగా గుళికలు సేవించాడని అతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో జట్టు కూలీ మృతి



కొయ్యలగూడెం, సెప్టెంబరు 4: విద్యుత్ షాక్‌కు గురై ఒక జట్టుకూలి మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం ఉదయం స్థానిక సంత మార్కెట్‌లో జరిగింది. ఈ ప్రమాదంలో నిడదవోలు మండలం లింగపల్లి గ్రామానికి చెందిన భీమడోలు శ్రీనివాస్ (42) మృతి చెందినట్టు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. శ్రీనివాస్ సంత మార్కెట్‌లో వాహనం నుంచి టమోట లోడ్ దించుతుండగా పైనున్న విద్యుత్‌వైర్లు తగిలాయి. దీంతో షాక్ కొట్టి రోడ్డుపై పడి మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సెల్‌ఫోన్ టవర్ల వద్ద బ్యాటరీల చోరీ

లింగపాలెం, సెప్టెంబరు 4: సెల్‌ఫోన్ టవర్ల వద్ద బ్యాటరీలు దొంగతనం చేస్తున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు. లింగపాలెం మండలం యడవల్లి గ్రామశివారులో ఉన్న సెల్‌ఫోన్ టవర్‌తో పాటు పలు గ్రామాల్లో సెల్‌ఫోన్ టవర్ల వద్ద ఉన్న బ్యాటరీలను దొంగతనం చేస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో పోలీసులు గస్తీ నిర్వహించి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. యడవల్లిలోనే కాకుండా చుట్టుపక్కల గ్రామాల్లో కూడా సెల్‌ఫోన్ టవర్ల వద్ద ఉన్న బ్యాటరీలను దొంగిలించి అమ్ముతున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 8 బ్యాటరీలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ఎస్ఐ చేస్తున్నట్లు తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరించిన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

13 నుంచి భీమవరంలో చెస్ టోర్నమెంట్

భీమవరంటౌన్, సెప్టెంబరు 4 : అనసూయ చెస్ అకాడమీ, జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13,14,15 తేదీల్లో భీమవరం వన్‌టౌన్ లోని శ్రీకృష్ణదేవరాయ కళ్యాణ మండపంలో మూడు రోజులపాటు పోటీలు ఇంటర్నేషనల్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. బ్రోచర్‌ను కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ బుధవారం ఆవిష్కరించారు. జిల్లా చదరంగం అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ ఈ టోర్నమెంట్లో వివిధ దేశాలకు, వివిధ రాష్ట్రాలకు చెందిన 400 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని, ఐదు లక్షల రూపాయల నగదు బహుమతులు అందిస్తున్నామని తెలిపారు. తోట హరిబాబు, జిల్లా పార్లమెంట్ కన్వీనర్ పేరిచర్ల శ్రీనివాసరాజు, టౌన్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి శివరామరాజు, జిల్లా సంయుక్త కార్యదర్శి మైలాపురి మురళి,అల్లు శ్రీనివాసులు పాల్గొన్నారు.

అది మంకీ పాక్స్ కాదు : డీఎంహెచ్‌వో

భీమవరం టౌన్, సెప్టెంబరు 4 : అత్తిలిలో కాశీశ్రీను అనే గొర్రెల కాపరికి మంకీపాక్స్ లక్షణాలు ఉన్నట్లుగా అనుమానాలు వచ్చాయని అతనికి విజయవాడ ల్యాబ్‌లో పరీక్షలు చేస్తే నిర్ధారణ కాలేదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ మహేశ్వరరావు తెలిపారు. శరీరంపై పొక్కులు స్కిన్ వ్యాధికి సంబంధించినవని తేలిందని బుధవారం ఆయనను ఫోన్‌లో సంప్రదించినపుడు వివరించారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

మొగల్తూరు,సెప్టెంబరు 4: మైనర్ బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం చేసిన యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జి.వాసు తెలిపారు. ముత్యాలపల్లికి చెందిన 16 సంవత్సరాల బాలికను అదే గ్రామానికి చెందిన నర్సింహస్వామి కిడ్నాప్ చేసి అత్యాచారం చేశాడన్నారు. దీంతో బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. నరసాపురం డీఎస్పీ మురళీకృష్ణ బుధవారం విచారణ చేశారు.

మహిళ మెడలోని బంగారు గొలుసు చోరీ

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 4 : స్కూలు నుంచి తన కుమారుడిని ఇంటికి తీసుకువెళ్తున్న ఒక మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై వచ్చి తెంపుకు పోయారు. ఏలూరు వన్ టౌన్‌లోని పడమర వీధికి చెందిన దార లక్ష్మీ ప్రసన్న (38) తన కుమారుడిని స్కూలు నుంచి బుధవారం మధ్యాహ్నం భోజనానికి ఇంటికి తీసుకువెళ్లి ఇంటి వద్ద గేటు తీస్తున్న సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలో ఉన్న నాలుగు కాసుల బంగారు మంగళసూత్రాల గొలుసును తెంపుకుని మోటారు సైకిల్‌పై పరారీ అయ్యారు. బాధితురాలు ఏలూరు వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొట్లాట కేసు నమోదు

పెదపాడు, సెప్టెంబరు 4 : పొలం వద్ద ఇరువర్గాల మధ్య తగాదా.. పరస్పర ఫిర్యాదుల నేపథ్యంలో పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. పెదపాడు గ్రామానికి చెందిన విజ్జి శేఖర్, రామచంద్రపురానికి చెందిన రౌతు రాజాలు పొలం వద్ద తగాదా పడగా ఇరువురికి దెబ్బలు తగిలినట్లుగా ఫిర్యాదు చేశారు. ఎస్సై కె.శుభశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్



ఏలూరు, బాలయోగి బ్రిడ్జి వద్ద పికెట్‌ను పరిశీలిస్తున్న సీఐ రమణ

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 4 : జిల్లాలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు కారణంగా వస్తున్న వరద నీరు వాగులు వంకలు, కాలువల్లో ప్రవాహం పెరిగిందని వీటిని దాటడానికి ప్రజలు ప్రయత్నాలు చేయవద్దని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ సూచించారు. జిల్లాలో కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు జల్లేరు, ఎర్రకాలువ, తమ్మిలేరు, చిన్న చిన్న వాగులు, రామిలేరు వంటి కాలువల ప్రవాహం పెరిగిందని ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండా లన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పొంగుతున్న కొండవాగులు, కల్వర్టులు వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మరోవైపు గోదావరి నదిలో వరద నీరు చేరుతు ండడంతో ఆ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముంద స్తుగా బ్రిడ్జిలు వద్ద, సప్టాలు వద్ద, లోబ్రిడ్జిలు వద్ద పోలీస్ పికె ట్లను ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఎలాంటి ప్రాణ నష్టం కలుగకుండా జాగ్రత్తలు, రక్షణ చర్యలు తీసుకోవాలని పోలీస్ యాంత్రాంగానికి సహకరించాలన్నారు.

పెరుగుతున్న వరద నీరు

తమ్మిలేరు కాలువలో వరద నీరు తగ్గుముఖం పట్టడంతో శనివారపుపేట లోబ్రిడ్జి వద్ద ఈనెల 3వ తేదీ నుంచి యధావిధిగా రాకపోకలు సాగించాయి. బుధవారం మళ్ళీ తమ్మిలేరు వరద నీరు పెరుగుతుండడంతో శనివారపుపేట లోబ్రిడ్జి పై నుంచి వరద నీరు ప్రవహించే అవకాశాలు ఉన్నట్లుగా అధికారులు అంచనా వేశారు. ముందస్తుగా త్రి టౌన్ సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ ప్రసాద్‌ల ఆధ్వర్యంలో ఆ ప్రాంతాల్లో పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు.

అధికారులు సిద్ధంగా ఉండాలి

పెదపాడు, సెప్టెంబరు 4 : వరద ముంపును ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ సూచించారు. మండలం కొణికి గ్రామ సరిహద్దుల్లో ప్రవహిస్తున్న బుడమేరు నీటి ప్రవాహాన్ని బుధవారం పరిశీలించారు. నాలుగు రోజులుగా కురిసిన వర్షాల ప్రభావంతో పైనుంచి వరదనీరు బుడమేరులో వస్తున్న సమీప గ్రామాలు ప్రమాదం బారినపడే అవకాశముందని అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు చేశారు.

కొణికి కాజ్‌వే మూసివేత

కొణికి గ్రామ సమీపంలో కాజ్‌వే పై నుంచి వరద నీటి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా రాకపోకలను నిలిపివేసినట్లుగా ఇన్‌చార్జి తహసీల్దారు ప్రసాద్‌బాబు తెలిపారు. కాజువే వద్ద పోలీసు, రెవెన్యూ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారన్నారు.

వర్షాలకు కూలిన ఇల్లు



కుక్కునూరు, సెప్టెంబర్టు 4: వీడకుండా కురుస్తున్న వర్షాలకు కుక్కునూరు మండలంలో 10కి పైగా ఇళ్లు దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో కొండపల్లి గ్రామానికి చెందిన పేరాల లక్ష్మయ్య, మారపాక పెదపున్నయ్య అనే ఇద్దరి ఇళ్లు నేలమట్టం అయ్యాయి. అధికారులు పరిశీలించి తమకు న్యాయం చేయాలని వారుకోతున్నారు.

పౌష్టికాహార ఉత్సవాలు

దెందులూరు, సెప్టెంబరు 4 : స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆట,పాటలతో కూడిన విద్య, బాలింతలు, గర్భిణులకు పౌష్టికా హారం, పాలు, గుడ్లు అందజేసి, పౌష్టికాహార ఉత్సవం నిర్వహిస్తున్నామని అంగన్వాడీ పెదపాడు ప్రాజెక్టు సీడీపీవో విజయలక్ష్మీ తెలిపారు. పోతు నూరు, కొవ్వలి అంగన్వాడీ కేంద్రాల్లో బుధవారం సూపర్ వైజర్ శ్రీదేవి ఆధ్యక్షతన గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు.

వేతన బకాయి వెంటనే చెల్లించాలి

కుక్కునూరు, సెప్టెంబర్టు 4: వీఓఏలకు ఆరు నెలలుగా ఉన్న పెండింగు వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి వైసాయికిరణ్ డిమాండ్ చేశారు. పలు సమస్యల పై ఏలూరు ఏబీఎంకు బుధవారం వినతిపత్రం అందజేశారు. యానిమేటర్ల సమస్యలు పరిష్కరించాలన్నారు. వీఓఏలను అక్రమంగా తొలగిస్తున్నారని, వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.

రక్తదానంతో ప్రాణదానం



లింగపాలెం, సెప్టెంబరు 4: రక్తదానంతో ఎంతోమంది ప్రాణాలు కాపాడవచ్చని దర్మాజీగూడెం వాసవీ క్లబ్ ఎస్.గంగాధర్‌రావు అన్నారు. గ్రామంలో వాసవీ క్లబ్ ఇంట ర్నేషనల్ వ్యవస్థాపకులు కేసీ గుప్తా జయంతి సందర్భంగా వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెంకు చెందిన సన్‌రైజ్ బ్లడ్‌బ్యాంకు వారు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా బి.ప్రకాశరావు, వాసవీక్లబ్ ప్రసిడెంట్ ఎస్.గంగాధర్‌రావు, ఎస్.బలరామకృష్ణ, ఎం.పుల్లేశ్వరరావు, వనితాక్లబ్ ప్రసిడెంట్ కె.రత్నమాల, పుష్పకుమారి, ఎస్.రమాదేవి, సభ్యులు పాల్గొన్నారు.

ఏలూరు వైసీపీ సమన్వయకర్తగా మామిళ్లపల్లి

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏలూరు శాసనసభ నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్తగా మామిళ్లపల్లి జయప్రకాశ్‌ను నియమించారు. ఈ మేరకు బుధవారం ఆపార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారికంగా ప్రకటించారు. ఏలూరు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చిన ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్(నాని) ఎన్నికల్లో ఓటమి తరువాత పార్టీని వీడారు. ఈ నేపథ్యంలో నానికి ప్రత్యామ్నాయంగా జయప్రకాశ్‌ను నియమించారు.

సంక్షిప్త సమాచారం..

- **జంగారెడ్డిగూడెం :** స్థానిక పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పలు ఫైళ్లను పరిశీలించారు. సీసీ కెమేరాలను పర్యవేక్షిస్తూ నేరాలకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. డీఎస్పీ రవిచంద్ర, సీఐ రాజేష్, ఎస్సై జబీర్ ఉన్నారు.
- తమ ఇంటి దారి సమస్య, పొలం సమస్యను పరిష్కరిం చాలని పట్టణానికి చెందిన చినకలపాల చినజీలుగులమ్మ, ఆమె తల్లి ముప్పిడి చుక్కమ్మ బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద వర్షంలో ధైరాయించారు. తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి వారిని సముదాయించారు.
- వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే వారంతా ముందుగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలని జంగారెడ్డిగూడెం సీఐ పి.రాజేష్ సూచించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యులతో సీఐ సమావేశం నిర్వహించారు. ఎస్సై ఎస్‌కె.జబీర్,వినాయక ఉత్సవ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.
- **భీమడోలు :** పోలసానపల్లిలో ఇటీవల మృతి చెందిన టీడీపీ నాయకుడు దూది సత్యనారాయణ జ్ఞాపకార్థం విద్యార్థులకు వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు.
- ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పూళ్ళలోని సంత మార్కెట్ వరసిద్ధి వినాయక ఆలయానికి రూ.లక్షన్నర వ్యయంతో నిర్మించిన షెడ్డు నిర్మాస్తానని టీడీపీ నాయకులు పి.హరీష్‌రావు బుధవారం ప్రారంభించారు. టీడీపీ నేతలు జి.లక్ష్మణ్, టి.పెదబాబు, తదితరులు పాల్గొన్నారు.
- **కొయ్యలగూడెం :** కురుస్తున్న వర్షాలకు అంకాలగూడెంలో ఇల్లు కూలి నిరాశ్రయులైన తిరుపతయ్య కుటుంబానికి స్థానిక నాయకులు, రెవెన్యూ అధికారులు నిత్యావసర సరుకులు అందజేశారు.
- **ఉంగుటూరు :** చేబ్రోలు స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఎం.సూర్య భగవాన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.
- **చింతలపూడి :** జంగారెడ్డిగూడెం సబ్ యార్డులో పడిపోయిన పాత పశువుల షెడ్డుకు సంబంధించి రేకులు, ఇనుప వస్తువులు ఈ నెల 9న బహిరంగ వేలం వేస్తున్నట్లు చింతలపూడి వ్యవసాయ మార్కెట్‌కమిటీ ప్రత్యేకశ్రేణి కార్యదర్శి షేక్ మెహ్రాజ్‌పాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అండగా మేమున్నాం

ఎమ్మెల్యేలు బాలరాజు, ప్రభాకర్





తాళ్లమూడి, ,పేరాంటాళ్ళపల్లిలో కూరగాయులు, నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, చిర్రి బాలరాజు

వేలేరుపాడు, సెప్టెంబరు 4: గోదావరి నదికి తిరిగి వరద పెరుగుతుందని బాగా పెరిగే వరకు చూడకుండా ముందుగానే గ్రామాలను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, మండల ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ ఏ.రాము ప్రజలకు సూచించారు. ఎమ్మెల్యే, అధికారుల బృందం మండలంలోని అత్యంత మారుమూల గ్రామాలైన అటుకూరు, కోయిద, పేరాంటాళ్ళపల్లి, టేకుపల్లి గ్రామాలకు బుధవారం బోటులో వెళ్లి ప్రజలు సూచించారు. బుధవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద గోదావరి వరద మొదటి ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తుందని ఇది మరింతా పెరిగే అవకాశం ఉందని ఎమ్మెల్యే అన్నారు. మండల ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ ఎ.రాము మాట్లాడుతూ గోదావరి వరద మొదటి ప్రమాద హెచ్చరిక సమయానికి వేలేరుపాడు మండలంలోని వరద ప్రభావిత 15 గ్రామాల్లోనే 943 కుటుంబాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశామన్నారు. 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, లీటరు నూనె, పంచదార, బంగాళ దుంపలు, ఉల్లిపాయలు, ఒక్కొక్క కిలో చొప్పున అందిం చామని అన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా అధికారులంతా అందుబాటులో ఉంటామని ఎమ్మెల్యే, అధికారులు గ్రామస్థులకు భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో జంగారెడ్డిగూడెం ఆర్‌డీఓ కె.అద్దయ్య, ఆర్‌ఎస్ఎస్ రాజు, వేలేరుపాడు, కొయ్యలగూడెం తహసీల్దార్‌లు వీవీ సత్యనారాయణ, చల్లన్నదొర, డీఎల్‌పీఓ రజవుల్లా, ఎంపీడీఓ మూర్తి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

726 కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ

పెదపాడు, సెప్టెంబరు 4 : వరదలకు నష్టపోయిన ప్రతి ఒక్కరిని కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదపాడు మండలం తాళ్లమూడిలో 500 మంది వరద బాధిత కుటుంబాలకు బుధవారం 25 కేజీల బియ్యం, మంచినూనె, కందిపప్పు, నిత్యావసర సరుకులు పంపిణీ నిర్వహించారు. ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వల్లే ఈనాటి దుస్థితి ఏర్పడిందని, డ్రెయిన్లు, కాలువలు మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల గ్రామాలన్నీ ముంపునకు గురయ్యాయన్నారు. మండల పరిధిలో ముంపునకు గురైన మొత్తం 726 కుటుంబాలకు కూడా నిత్యవసర సరు కులు అందజేస్తామని ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో కూటమి శ్రేణులు, వరద బాధితులు పాల్గొన్నారు

వారిని ఎలా రక్షించాలంటే..

రోబో లైఫ్ బోటుతో డెమో



రోబో బోటును ఆపరేట్ చేస్తూ నీటిలో ఉన్న వ్యక్తిని కాపాడుతున్న దృశ్యం

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 4 : నీటి ప్రవాహం, వరదలు, వాగుల్లో కాలవల్లో చిక్కుకున్న వారిని తక్షణం కాపాడడానికి రోబో లైఫ్ బోటును వినియోగించవచ్చునని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం వరదల ప్రవాహం ఉన్న నేపథ్యంలో స్టేట్ డిజాస్టర్ రెస్క్యూ ఫోర్స్ బృందంతో డెమో కార్యక్రమాన్ని ఏలూరు తూర్పు లాకుల సమీపంలోని బెయిలీ బ్రిడ్జి వద్ద బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కిషోర్, ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు. ఒక వ్యక్తి తమ్మిలేరు ప్రవాహంలో కొట్టుకుపోతుండగా రోబోలైఫ్ బోటు ద్వారా ఎలా రక్షించవచ్చో చూపించారు. ఇదంతా బ్రిడ్జిపై నుంచి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందంలోని అధికారి రిమోట్‌తోనే రోబోను నడిపించారు. ఏలూరు టూటౌన్ సీఐ వైవీ రమణ, ట్రాఫిక్ సీఐ కె.శ్రీనివాసరావు, ఏలూరు వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ, త్రీ టౌన్ సీఐ కోటేశ్వరరావు, ఏఆర్‌ఆర్ఐ పవన్‌కుమార్ పలువురు పాల్గొన్నారు.

లైసెన్సు లేకుండా వాహనాలు నడపరాదు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 4 : మైనర్లు డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడ పకూడదని ఏలూరు త్రి టౌన్ సీఐ కోటేశ్వరరావు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ కెపిఎస్ కిషోర్ ఆదేశాలతో ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ ప్రసాద్ వారి సిబ్బంది కలిసి ఏలూరు సెయింట్ ఆన్స్ కాలేజీ వద్ద బుధవారం సాయంత్రం వాహనాల తనిఖీలు చేపట్టారు. విజిబుల్ పోలీసింగ్ కూడా నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మైనర్లకు కౌన్సిలింగ్ చేశారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడపకూడదన్నారు. ఒక విద్యార్థి తన ఇంట్లో కుటుంబ సభ్యులు జ్వరాలతో బాధపడుతున్నారని మందులు తీసుకోవడానికి వచ్చానని మందుల చీటి చూపించాడు. అయినప్పటికీ డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలను నడిపితే జరగరాని ప్రమాదం జరిగితే తీరని నష్టం చవిచూడాల్సి వస్తుంది. లైసెన్సు ఉన్న వారిని తోడుగా తెచ్చుకోవాలే తప్ప డ్రైవింగ్ లైసెన్సు లేని వారు వాహనాలు నడపకూడదని ఆయన సూచించారు. వాహనాల రికార్డులను తనిఖీలు చేశారు. రికార్డులు సరిగా లేనివారికి ఇ చలానాలను విధించారు.

కమ్యూనిటీ హాలు ఏర్పాటు చేయాలని వినతి



వినతిపత్రాన్ని అందచేస్తున్న యడవల్లి గ్రామస్తులు

కామవరపుకోట, సెప్టెంబరు 4 :మండలంలోని తూర్పుయడవల్లి పంచాయతీకి చెందిన ఎస్సీ సామాజికవర్గం ప్రజలు తమ గ్రామంలో కమ్యూనిటీ హాలు నిర్మించేలా ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌కు సిఫార్సు చేయాలంటూ బుధవారం మండల తెలుగుదేశం అధ్యక్షుడు కిలారు సత్యనారాయణకు వినతిపత్రాన్ని అందచేశారు. ఎ.సత్యనారాయణ, కె.లక్ష్మణ రావు, ఎ.ఏసు, రమేష్, టి.వెంకన్నబాబు, డి.గంగాధరరావు తదితరులు ఉన్నారు. కమ్యూనిటీ హాలు ఏర్పాటు కోసం సహకరిస్తానని సత్యనారాయణ హామీ ఇచ్చారు.

బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

ఏలూరు రూరల్, సెప్టెంబరు 4: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం అశోక్‌నగర్‌లోని జిల్లా కార్యాలయంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ పాకా సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్, కన్వీనర్ కె.కృష్ణప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సత్యనారాయణ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన ఏకైక పార్టీ బీజేపీ అన్నారు. జిల్లా సభ్యత్వ ప్రముఖ్ ఎస్.మాల తిరాణి, పలువురు నాయకులు మాట్లా డుతూ బూత్‌లవారీగా సభ్యత్వ నమోదు చేపట్టాలని సూచించారు. నాయకులు ఇ.చక్రవర్తి వర్మ, కె.సుధాకర్ కృష్ణ, ఎన్.దానభాస్కర్‌రావు పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 4 : ఏలూరు ప్రభుత్వాస్పత్రి ఆవరణలో రెడ్‌క్రాస్ భవనంలో ఆరుగురు తలసేమియా చిన్నారులకు బుధవారం రక్తమార్పిడి నిర్వహించినట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి తెలిపారు. సీనియర్ సిటి జన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు కాట్రగడ్డ సాయాజీరావు, ఏలూరు రోట రీ క్లబ్ అధ్యక్షులు ఎన్‌జీవీవీ స్వామి, రెడ్‌క్రాస్ కార్యదర్శి కేటీ సీతారామ్, డాక్టర్ వర ప్రసాదరావు, ఆర్ఎస్ఆర్ బుజ్జి, పాల్గొన్నారు.

వృత్తి చెరువులకు హద్దులు కేటాయించాలి

ఏలూరు రూరల్, సెప్టెంబరు 4: రాష్ట్ర వ్యాప్తంగా రజకులకు కేటాయించిన చెరువులను సమగ్ర సర్వే చేసి హద్దులు కేటాయించి ఆదుకోవాలని రజక జన సంఘ జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య కోరారు. సంఘ భవనంలో బుధవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు రజక చెరువులు నీటితో పొంగిపొర్లి చేపలు కొట్టుకుని పోయి తీవ్రనష్టం వాటి ల్లిందన్నారు. తాళ్ళపూడి మండలంలో గ్రామ చెరువుకు లీజు తగ్గించాలన్నారు. అనంతరం తిరుగుడుమెట్ట రజకసంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడిగా డి.పాపారావు, కార్యదర్శిగా పి.రత్నాజి, సహాయ కార్యదర్శిగా సత్యనారా యణ, కోశాధికారిగా పి.పోశయ్య, పి.శివలింగం, కె.కృష్ణను ఎన్నుకున్నారు.

విజిలెన్స్ ఎస్పీగా శ్రీరామ్‌బాబు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 4 : జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజినల్ ఆఫీసర్‌గా అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీరామ్‌బాబును నియమిస్తూ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ (విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మె ంట్) హరీష్ కుమార్‌గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్‌లో పని చేస్తున్న 12 మంది అధికారులను బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీనిలో భాగంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రాష్ట్ర కార్యాలయంలో పరిపాలనా విభాగంలో గత నెల 27న విధుల్లోకి చేరిన శ్రీరామ్‌బాబును ఏలూరు జిల్లా రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్‌గా నియమించారు. రేపు ఆయన విధుల్లో చేరనున్నట్లు సమాచారం.

టీడీపీ నాయకుడికి నివాళి



కొయ్యలగూడెం, సెప్టెంబరు 4: ఇటీవల మృతి చెందిన కన్నాయిగూడెంకు చెందిన టీడీపీ నాయకుడు జి.ఉదయభాస్కర్‌కు కూటమి నాయకులు బుధవారం నివాళులర్పించారు. మండలంలోని పొంగుటూరులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతి తీరని లోటని నాయకులు తెలిపారు. కూటమి నేతలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

దారితప్పిన బాలుడు..



తల్లిదండ్రులకు బాలుడిని అప్పగిస్తున్న సీఐ కోటేశ్వరరావు

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 4 : ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలుడు దారితప్పాడు. ఆ బాలుడిని అర గంటలోనే తల్లిదండ్రులకు అప్పగించారు పోలీసులు. వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు వన్ టౌన్ ప్రాంతానికి చెందిన పోసుపల్లి హర్ష (3) ఇంటి నుంచి బయటకు వచ్చి దారి తప్పాడు. ఏలూరు మినీ బైపాస్ రోడ్డులో బాలుడు ఏడుస్తూ తిరుగు తుండగా స్థానికులు త్రీ టౌన్ పోలీసులకు సమాచారమి చ్చారు. దీంతో సీఐ కోటేశ్వరరావు, మహిళా హెడ్‌కానిస్టేబుల్ సుజాత కలిసి ఆ బాలుడిని తమ సంరక్షణకు తీసుకుని బాలుడి వివరాలు తెలుసుకుని గొల్లాయిగూడెం సచివాలయం వద్దకు తీసుకువెళ్లారు. అక్కడి ఏఎన్ఎం సహకారంతో బాలుడి తండ్రికి సమాచారం ఇచ్చారు. దీంతో తల్లిదండ్రులు అక్కడికి రావడంతో ఆ బాలుడిని సీఐ కోటేశ్వరరావు వారికి అప్పగించారు.

పేకాట ఆడుతున్న 16 మంది అరెస్టు

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 4 : స్థానిక నూకాలమ్మ గుడి సమీపంలో ఒక ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు ఏలూరు టూటౌన్ సీఐ వైవీ రమణకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ సాధిక్ తన సిబ్బందితో బుధవారం రాత్రి 9.30 గంటలకు దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న ఐదుగురు పురుషులను, విజయవాడ సింగ్‌నగర్‌కు చెందిన నలుగురు మహిళలను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.13 వేల 80లు నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● టి.నరసాపురం : పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఏఎస్సై వి.జయకుమార్ తెలిపారు. శ్రీరామవరం గ్రామ శివారులో బుధవారం పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సిబ్బంది తో దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1800 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై జయకుమార్ తెలిపారు.

ఊడిన సీలింగ్.. పేషెంట్ తలకు గాయం



బాధితుడుని పరామర్శిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

జంగారెడ్డిగూడెం, సెప్టెం బరు 4 : స్థానిక ఏరియా ఆస్ప త్రిలోని డయాలసిస్ విభా గంలో సీలింగ్ ఊడి పడి కిడ్నీ డయాలసిస్ పేషెంట్ పఠాన్ మహబూబ్ సుభాని తలకు తీవ్ర గాయామైంది. తలకు ఇనప రాడు తగలడంతో వైద్య సిబ్బంది నాలుగు కుట్లు వేశారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి ఏరియా ఆస్పత్రికి వచ్చి బాధితుడిని పరామర్శించారు. అతనికి మెరుగైన వైద్యం అందించాలని సూపరింటెండెంట్ డాక్టర్ బేబీ కమలను ఆదేశించారు. ఈ సందర్భంగా జేసీ ధాత్రిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ ప్రైవేట్, పబ్లిక్ పార్టనర్‌షిప్‌తో అపోలో డయాలసిస్ యూనిట్‌ను ఇక్కడ నడుపుతున్నారని తెలిపారు. కొద్ది రోజుల నుంచి సీలింగ్ కిందికి దిగి ఉందని సూపరింటెండెంట్ ఇంతకుముందే తనకు చూపించారని ఈ విషయాన్ని అపోలో డయాలసిస్ యాజమాన్యానికి చెప్పాలని సిబ్బందికి సూచించినట్లు తెలిపారు.అయినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించారని తెలిపారు. డయాలసిస్ విభాగంలో సీలింగ్ పనులు వెంటనే పూర్తి చేయిస్తామని,ఆలస్యమైతే డయాలసిస్ పేషెంట్లకు వాహనాలను ఏర్పాటు చేసి ఏలూరు,ద్వారకాతిరుమల ఆసుపత్రులకు తరలించి అక్కడ డయాలసిస్ చేయిస్తామని తెలిపారు.ఈ ఘటన వివరాలను జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి తెలియచేస్తామని తెలిపారు. పూర్తి వివరాలు విచారణ చేయిస్తామని తెలిపారు. తహసీల్దారు కె.స్లీవజోజి పాల్గొన్నారు.

వరద బురద తొలగింపు



మురుగు నీరు పారేందుకు వేస్తున్న సిమెంట్ పైపులు

లింగపాలెం, సెప్టెంబరు 4: ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్లలోకి వరద నీరు చేరడంతో యడవల్లి ఎస్సీకాలనీ వాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తమ సమస్యను సర్పంచ్ కట్టుబోయిన రమేష్‌తో పాటు కూటమి నేతలకు తెలుపడంతో వారు వెంటనే స్పందించి యడవల్లిలోని ఎస్సీకాలనీతో పాటు పలుకాలనీల్లో వరద బురద బయటకు వెళ్లేందుకు జేసీబీతో కాలువలు తీయించి సిమెంట్ పైపులు వేయించారు. ప్రజలకు అంటువ్యాధులు సోకకుండా గ్రామంలో శానిటేషన్, బ్లీచింగ్ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ రమేష్, వైస్ ప్రసిడెంట్ ఎం.జయరాజు, పంచాయతీ కార్యదర్శి పాపయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఊరు దాటాలంటే..

సాహసం చేయాల్సిందే

కోమటిలంక గ్రామస్థుల అవస్థలు



ప్రమాదకరంగా కాలువ దాటుతున్న విద్యార్థులు

ఏలూరు రూరల్, సెప్టెం బరు 3: ఆ ఊరు దాటా లంటే కాలువ దాటాలి, కా లువదా టాలంటే పడవ ఎక్కాలి. పెద్దలు, చిన్నారులు రోజు సాహసం చేస్తూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ఇది ఎక్కడో కాదు ఏలూరు రూరల్ మండలం, కోమ టిలంక గ్రామ దుస్థితి. ప్రతి ఏడాది తమ్మిలేరు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తుంటుంది. గ్రామంలో సుమారు 1600 కుటుంబాలు నివాసముంటున్నాయి. విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలన్నా.. నిత్యావసర సరుకుల కోసం గ్రామస్థులు ఈ కాలువ దాటి వెళ్లాల్సిందే. కొద్దిపాటి వరద వచ్చినా కాలువ ఉధృతంగా ప్రవహి స్తుండటంతో స్థానికులు వెళ్ళలేని పరిస్థితి. అత్యవసర పరిస్థితుల్లో వైద్యానికి సైతం కాలువదాటుతూ ప్రాణాలకు తెగించి సాహసాలు చేస్తున్నారు. అధికారు లకు ఎన్నిసార్లు విన్నవించినా అది అటవీ ప్రాంతం కావడంతో తామేమి చేయలేమంటూ దాటవేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి కోమటిలంక కాలువపై వంతెన నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

22 మందికి ఉద్యోగ అవకాశాలు

ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 4 : స్థానిక ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించి 22 మందిని ఎంపిక చేసి నియామక పత్రాలు అందచేసినట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఘంటా సుధాకర్ తెలిపారు. ఈ జాబ్‌మేళాకు బజాజ్ క్యాపిటల్, తనిష్క్, రిలయన్స్, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నట్టు చెప్పారు. ఈ మేళాకు 54 మంది యువకులు హాజరు కాగా 22 మంది ఎంపికయ్యారని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ రజిత, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి మధుభూషణరావు, కో ఆర్డినేటర్స్ రాజేశ్వరి, సునీల్, రవి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

94 మందికి వివిధ కంపెనీల్లో ఉపాధి

జిల్లాలోని 94 మంది యువకులకు 18 వివిధ కంపెనీల్లో ఉపాధి కల్పన సౌకర్యాన్ని కలుగచేసినట్టు సుధాకర్ తెలిపారు. అపోలో ఫార్మసిస్, ముత్తూట్ ఫైనాన్స్ రిలయన్స్ కంపెనీల ప్రతినిధులు వీరిని ఎంపిక చేశారన్నారు. కుసుమ, ప్రవీణ్, రామకృష్ణ, సత్యనారాయణ, సురేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

10న మినీ జాబ్‌మేళా

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 4 : ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఈ నెల 10న ఏలూరు కలెక్టరేట్ సమీపంలోని ప్రభుత్వ డీఎల్‌టీసీ, ఐటీఐలో మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యే ఈ జాబ్‌మేళాలో సుమారు 150 మందికి ఉద్యోగావకాశాలుంటాయన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ విద్యార్హతలుండి, 18 నుంచి 35 సంవత్సరాల వయస్సుగల నిరుద్యోగ యువతీ, యువకులు హాజరుకావచ్చన్నారు. వివరాలకు 94934 82414, 89196 08183 లో సంప్రదించాలన్నారు.

ఉద్యోగావకాశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 4 : జపాన్ కేర్ వర్కర్స్ ఇన్ హాస్పిటల్స్, కేర్‌హోం ఫెసిలిటీ ఉద్యోగావకాశాలకు ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ విద్యార్హతలతో వయస్సు 18-35సంవత్సరాల యువతీయువకులకు శిక్షణనిమిత్తం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ అధికారి జి.సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులోబాగంగా తొలుత జపనీస్ భాషలో రెసిడెన్షియల్ విదానంలో ఆరునెలలపాటు బెంగళూరులో శిక్షణ ఉంటుందని, దీని నిమిత్తం రిజిస్ట్రేషన్ ఫీజుగా రూ.50వేలు చెల్లించాల్సిఉండగా, ఇందులో రూ.25వేలు భరిస్తే, మిగతాసగంమొత్తాన్ని ఏపీఎస్ఎస్‌డీసీ చెల్లిస్తుందన్నారు. శిక్షణకు ఫీజు రూ.3లక్షలు అభ్యర్థి చెల్లించాల్సిఉంటుందన్నారు. శిక్షణకాలంలో ఉచిత వసతి, బోజన సౌకర్యాలు కల్పిస్తారని వివరించారు. శిక్షణ పూర్తిచేసుకున్నవారికి నెలకు రూ.1.10లక్షలనుంచి రూ.1.40లక్షలు జీతంపై ఉద్యోగావకాశాలు కల్పిస్తారని, పూర్తి వివరాలకు కిషోర్ ఫోన్‌నెంబరు 90302 27668లో సంప్రదించాలని కోరారు.

17 వరకు ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు గడువు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 4 : డిసెంబరు 8న జరుగనున్న ఎన్ఎంఎంఎస్ పరీక్షకు ఆన్‌లైన్ అప్లికేషన్‌ను బీఎస్ఈ.ఏపీ.జీవోవి.ఐఎన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు డీఈవో అబ్రహం తెలిపారు. దరఖాస్తుచేసుకునే గడువును ఈ నెల 17వరకు పొడిగించినట్టు వివరించారు.

వరద బాధితులను ఆదుకుందాం

ఏలూరు రూరల్, సెప్టెంబరు 4: ప్రకృతి విలయతాండవానికి విజయవాడ పట్టణం పూర్తిగా మునిగిపోయిందని, వీరిలో ఎలక్ట్రికల్ వర్కర్స్ ఎక్కువ మంది ఉన్నారని, వీరితో పాటు వరద బాధితులను ఆదుకునేందుకు రాష్ట్రంలోని ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్‌లోని వివిధ ఎలక్ట్రికల్ అసోసియేషన్లు యూనియన్ తరఫున ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. స్థానికంగా బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విరాళాలు అందిస్తే వాటితో వరద బాధితులను ఆదుకుందామని పిలుపునిచ్చారు. ప్రధాన కార్యదర్శి బి.రామకృష్ణ, నాయుడు గంగాధర్‌రావు, రాజ్‌కుమార్, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

చింతలపూడి, సెప్టెంబరు 4: పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకుంటే ఆరోగ్యంతో పాటు చురుకుగా పనిచేస్తారని మండల పరిషత్ అధ్యక్షులు డాక్టర్ బి.రాంబాబు అన్నారు. న్యూట్రిషన్ డే సందర్భంగా స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు పోషక విలువల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఆయనతో పాటు జడ్పీటీసీ నీరజ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో పాల్గొన్నారు.

వస్త్ర దుకాణం వద్ద నిరసన

జంగారెడ్డిగూడెం,సెప్టెంబరు 4 : పట్టణంలోని ఓ వస్త్ర దుకాణంలో హెచ్‌ఆర్‌గా పని చేసిన తనను పలువురు సిబ్బంది కులం పేరుతో దూషిస్తున్నారని, తనకు రావలసిన డబ్బు కూడా ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని బొల్లిపో సందీప్ అనే వ్యక్తి బుధవారం వస్త్ర దుకాణం ఎదుట ధర్నా నిర్వహించారు. తనకు న్యాయం జరగకపోతే చావే శరణ్యమని పురుగుమందు డబ్బా పట్టుకుని పలువురు యువకులతో నిరసన వ్యక్తం చేశాడు. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి ఇరు వర్గాలతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ధరల నియంత్రణపై సీపీఐ ఆందోళన

కుక్కునూరు, సెప్టెంబర్టు 4: దేశంలో ధరల నియంత్రణ పై సీపీఐ చేపట్టిన ఆందోళన బుధవారం కుక్కునూరు, మారేడుబాక, ధాచారం, అరవాయిపల్లి సచివాలయం ఎదుట నిర్వహించారు. బాబురావు, పాపారావు, చోడి రాంబాబు, బూరెం లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఏ క్షణాన.. ఏం జరుగునో..?

- కొల్లేరుకు పొంచి ఉన్న వరద ముప్పు
- అధికారుల పరిశీలన
- ఇప్పటికే కైకలూరు ఆర్అండ్‌బీ రహదారిపై చేరిన వరద నీరు
- అస్తవ్యస్త డ్రైన్లతో ఇళ్లలోకి విష సర్పాలు
- వర్షాలు పడితే నూజివీడులో చెరువులకు గండ్ల ముప్పు



కైకలూరు-ఏలూరు ఆర్అండ్‌బీ రహదారిలో కొల్లేరు వరద

కైకలూరు, సెప్టెంబరు 4: ఎగువ నుంచి వరద నీరు భారీగా రావడంతో పలు డ్రెయిన్లు పొంగిపొర్లుతూ కొల్లేరు సరస్సులో కలుస్తున్నాయి. కైకలూరు మండలం ఆటపాక పక్షుల కేంద్రం చెరువు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. పక్షుల కేంద్రానికి ఆనుకొని ఉన్న పోల్‌రాజ్ డ్రెయిన్ ఉధృతంగా ప్రవహిస్తూ కొల్లేరు సరస్సులో కలుస్తోంది. దీంతో గట్టు అంచులను తాకుతూ నీరు ప్రవహిస్తోంది. దీంతో పక్షుల కేంద్రం చెరువు గట్టు పూర్తిగా మునిగిపోయే పరిస్థితి నెలకొంది. ముంపునకు గురైతే పక్షుల కేంద్రం చెరువులోని మత్స్య సంపద కొల్లేరులో కలిసిపోనుంది. అలాగే పందిరిపల్లిగూడెంలోని సర్కారు కాలువ కూడా ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కొల్లేరు గ్రామాల ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఎగువ నుంచి భారీగా వరద నీరు రావడంతో మండవల్లి మండలం పెనుమాకలంక గ్రామ రహదారి, కైకలూరు-ఏలూరు ఆర్అండ్‌బీ రహదారిలో చిన ఎడ్లగాడి వద్ద రోడ్డుపై నుంచి రెండు అడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. దీంతో కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్ ఆ ప్రాంతాన్ని పరిశీలించి పోలీస్ పికెట్‌ను ఏర్పాటుచేశారు. బుధవారం రాత్రి వాహన దారులను నీటి ప్రవాహాన్ని బట్టి అనుమతిస్తామన్నారు. ఉధృతంగా నీరు ప్రవహిస్తే రాకపోకలను పూర్తిగా నిలిపివేస్తామని పేర్కొన్నారు. కైకలూరు మండలంలోని కొల్లేరు ప్రాంతాన్ని తహసీల్దార్ ఉదయ భాస్కరరావు, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఈవోపీఆర్డీ రవిశంకరరావు పరిశీలించారు. ప్రజలు ఎక్కడైనా ఇబ్బందులకు గురైతే తక్షణమే అధికారుల దృష్టికి తేవాలన్నారు. కైకలూరు పట్టణంలో డ్రైన్లు అస్తవ్యస్తంగా ఉండడంతో పూర్తిగా వర్షపునీరు పారుదల లేక ఇళ్ళలోకి చేరుతోంది. కైకలూరు కుమ్మరి బజారు ఎదురుగా ఉన్న రోడ్డులో వర్షపునీరు ఇళ్ళల్లోకి చేరి రెండు విష సర్పాలు ఇళ్ళలోకి చొరబడడంతో ప్రజలు వాటిని హతమార్చారు. గత నాలుగు రోజులుగా నీరు నిల్వ ఉన్నప్పటికీ పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంపై ఆయా ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే కైకలూరు టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న రహదారిలోని నివాస గృహాల్లోకి నీరు చేరడంతో తహసీల్దార్ ఉదయ భాస్కర రావు ఆయా ప్రాంతాన్ని సందర్శించి డ్రైన్ల మరమ్మతులు నిర్వహించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు.



నూజివీడులో కోతకు గురైన మొగల్ చెరువు కట్ట

మోగుతున్న ప్రమాద ఘంటికలు

నూజివీడు, సెప్టెంబరు 4: తెలుగు రాష్ట్రాలకు తుఫాను హెచ్చరికల నేపథ్యంలో నూజివీడు నియోజకవర్గంలో మరోసారి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నూజివీడు పెద్దచెరువుకు భారీ గండ్లుపడి, భారీ నష్టాన్ని మిగిల్చింది. అంతేకాక కేవలం మూడు గంటలపాటు పడిన వర్షానికి నియోజకవర్గంలో దాదాపు 99 శాతం చెరువులు నీటితో నిండి కళంగి పారుతోంది. దీంతో మరోసారి తుఫాన్ ప్రభావంతో బారీవర్షాలు పడితే మరికొన్ని చెరువులకు గండ్లుపడే అవకాశం ఉందని గ్రామస్థులు వాపోతున్నారు. నూజివీడు మండలంలో ఇప్పటికే దాదాపు 12 చోట్ల చెరువులకు గండ్లు పడ్డాయి. ప్రధానంగా నూజివీడు మండలం బత్తులవారి గూడెం అప్పారావు చెరువు, కొత్త చెరువులకు గండ్లు పడటంతో ఆ నీరు ఒక్కసారిగా సుంకొల్లులోని చెరువులకు ప్రవహించింది. సుంకొల్లులో కూడా చెరువులకు గండ్లు పడటం, మరోవైపు నాగార్జున సాగర్ కాలువ యూటీ యనమదల గ్రామం వద్ద కుప్పకూలడంతో మొత్తం నీరు నూజివీడు పట్టణంలోని పెద్దచెరువుకు చేరింది. అదే సమయంలో భారీ వర్షాలతో దాదాపు తెలంగాణ నుంచి నీటిని తీసుకువచ్చే బిల్లుడు వాగు సైతం ఉధృతంగా ప్రవహించడంతో కేవలం రెండు గంటల్లోనే చెరువు నిండి కట్టలు కోతకు గురై గండ్లు పడటం, వరద నీటిలో నూజివీడు పట్టణం చిక్కుకున్న విషయం పాఠకులకు విదితమే. నియోజకవర్గంలో అప్పటి వరకు నీరు లేక ఖాళీగా ఉన్న చెరువులు దాదాపు 99 శాతం నీటితో నిండి అలుగులు పారాయి. వీటిలో యనమదల పెద్దచెరువు, నూజివీడు మొగల్ చెరువు, తూర్పు దిగవల్లిలోని మరో చెరువుకు, చెరువులు కట్టలు బలహీనమై ఇప్పటికే కోతకు గురయ్యాయి. వీటితో పాటు పలు చెరువు కట్టలు సైతం బలహీనంగా ఉండటంతో తుఫాను ప్రభావంతో పడే భారీ వర్షాలకు ప్రజలు బిక్కుబిక్కు మంటున్నారు. నూజివీడు డివిజన్ పరిధిలో తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు బుధవారం నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమావేశం అయ్యాయి. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో కాజ్‌వేలు ఎన్ని ఉన్నాయి? ఎక్కడెక్కడ ముందు జాగ్రత్త చర్యలు, నిషేధాజ్ఞలు అమలు పరచాలనే అంశంపై సమావేశాన్ని నిర్వహించారు. నూజివీడు పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి, డిప్యూటీ తహసీల్దార్ సింగ్, ఇరిగేషన్ ఏఈ అభినేష్ తదితరులు పాల్గొన్నారు.

బలహీనంగా ఉన్న కట్టల పటిష్ఠతేదీ..?

నూజివీడు నియోజకవర్గంలో ప్రమాద ఘంటికలు మోగిస్తున్న పలు చెరువుల కట్టలను పటిష్ఠం చేసేందుకు ముందస్తు చర్యలు తీసుకోవడంలో రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు విఫలమయ్యాయని చెప్పవచ్చు. గత భారీ వర్షాలకు ముందే విపత్తుల నిర్వహణ సంస్థ కృష్ణా, ఎన్‌టీఆర్, ఏలూరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్‌ను ప్రకటించింది. అయితే నాడు బలహీనంగా ఉండే చెరువు కట్టలను బలపరిచేందుకు కావాల్సిన ఇసుక బస్తాలను సమకూర్చటంలో ప్రభుత్వ అధికారులు ఘోరంగా విఫలమయ్యారు. తిరిగి తుఫాన్ ప్రభావంతో కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంటూ ఆరెంజ్ అలర్ట్‌ను వాతావరణ శాఖ పేర్కొంది. అయితే ఇప్పటివరకు బలహీనంగా ఉన్న చెరువు కట్టలకు బలోపేతం చేసే విషయంలో కూడా ఇసుక బస్తాలను అందుబాటులో ఉంచడంలో సంబంధిత శాఖలు పూర్తిగా విఫలమయ్యాయనే ఆరోపణలు గ్రామస్థుల నుంచి వినిపిస్తున్నాయి.

కైకలూరులో భారీ వర్షం.. విరిగిపడిన చెట్టు



కైకలూరు, సెప్టెంబరు 4: కైకలూరు నియోజక వర్గంలో కురిసిన భారీ వర్షాలకి లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి. మంగళవారం అర్ధరాత్రి నుండి బుధవారం మధ్యాహ్నం వరకు భారీవర్షం కురిసింది. కైకలూరు ఆర్టీసీ బస్టాండులో ప్రయాణీకుల నడకదారిలో చెట్టు విరిగిపడింది. భారీ వర్షానికి బస్టాండు ఆవరణలోకి నీరు చేరింది. అలాగే కైకలూరు వెలమపేట, బ్రహ్మంగారి గుడివీధి, స్టేషన్ రోడ్డు ముంపునకు గురైంది. బ్రహ్మంగారి గుడి వీధిలోని డ్రైన్‌ను యంత్రాలతో పంచాయతీ అధికారులు మరమ్మతులు నిర్వహించారు. కైకలూరు మండలంలో 62.6 మిల్లీమీటర్లు, కలిదిండి 11 మిల్లీమీటర్లు, ముదినేపల్లి 44.4 మిల్లీమీటర్లు, మండవల్లిలో 44.6 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. ఈ భారీ వర్షాలకు ముదినేపల్లి మండలంలోని పంట పొలాల్లోని వర్షపునీరు చేరింది. డ్రెయిన్లన్నీ పొంగి పొర్లుతున్నాయి.

కాజ్‌వేపై రాకపోకలు పునరుద్ధరణ

చాట్రాయి, సెప్టెంబరు 4: మండలంలోని చిన్నంపేట, చింతలపూడి మండలం శివపురం గ్రామాల మధ్య తమ్మిలేరు కాజ్‌వేకి తాత్కాలిక మరమ్మతులు చేసి బుధవారం సాయంత్రం రాకపోకలు పునరుద్ధరించారు. భారీ వర్షాలకు తమ్మిలేరుకు వరద పోటెత్తటంతో శనివారం నాడు కాజ్‌వే అప్రోచ్ రోడ్డుకు గండి పడి రాకపోకలు నిలిచిపోయిన విషయం విదితమే. చిన్నంపేట గ్రామస్థుడు, టీడీపీ లీగల్ సెల్ జిల్లా కార్యదర్శి అత్తులూరి శ్రీనివాసరావు ప్రజల సౌకర్యార్థం సొంత నిధులతో తాత్కాలిక మరమ్మతులు చేయించారు. చిన్నంపేటకు చెందిన రైతులకు ఏటి అవతల శివపురంలో, అక్కడి రైతులకు ఇక్కడ వ్యవసాయ భూములు ఉన్నాయి. శివపురానికి చెందిన 200 మంది విద్యార్థులు చిన్నంపేట పాఠశాలల్లో చదువుతున్నారు. కాజ్‌వేకి ప్రతి ఏటా గండి పడి ప్రజలు ఇబ్బందులు పడటం షరా మామూలు అవుతున్నది. ప్రభుత్వం స్పందించి చిన్నంపేట వైపు అప్రోచ్ రోడ్డు స్థానంలో ఖానాలు నిర్మించాలని రెండు మండలాల ప్రజలు కోరుతున్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

కలిదిండి, సెప్టెంబరు 4: పోషకాహారంతోనే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని ప్రతిరోజు విద్యార్థులకు పోషకాహారం అందించాలని ఎంపీడీవో దినతేజ్ అన్నారు. జాతీయ పోషకాహార దినోత్సవం సందర్భంగా బుధవారం కలిదిండి అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. ఉపాధి ఏపీవో ఆనంద్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ముదినేపల్లి, సెప్టెంబరు 4 : ముదినేపల్లి మండలంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. వర్షాల వల్ల నెలకొన్న అపరిశుభ్రతను నివారించి, పారిశుధ్యాన్ని మెరుగుపర్చేందుకు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య చర్యలు చేపట్టారు. శ్రీహరిపురం పంచాయతీ పరిధిలో రహదారుల వెంబడి బ్లీచింగ్ పౌడర్ చల్లటంతోపాటు దోమల నివారణకు మలాథియాన్ పిచికారీ చేస్తున్నారు. సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా వి. రామోజీరావు



కైకలూరు, సెప్టెంబరు 4: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని జిల్లా విద్యా శాఖాధికారులు వెల్లడించారు. వారిలో కైకలూరు మండలం గోనెపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న విశ్వనాథుని రామోజీరావు 2024వ సంవత్సరానికి గాను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఆయనకు ఎంఈవో డి. రామారావు అభినందనలు తెలిపారు. రామోజీరావు 14 ఏళ్లుగా పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పనిచేసి విద్యార్థులకు మెరుగైన బోధన అందించారు. 2017లో ఉపాధ్యాయులకు ఇచ్చిన వృత్యంతర శిక్షణా కార్యక్రమాలకు జిల్లా రిసోర్స్ పర్సన్‌గా పనిచేశారు. అలాగే పలు విద్యాసంస్థల్లో చేపట్టిన పలు కార్యక్రమాల్లో ఆయన ఉత్సాహభరితంగా పనిచేశారు. ఈ అవార్డు రావడం పట్ల పలువురు ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయుడు వెంకట రత్నంకు అవార్డు



ముదినేపల్లి, సెప్టెంబరు 4: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 2024-25 విద్యా సంవత్సరానికి జిల్లా స్థాయి ఉత్తమ తెలుగు పండిట్ అవార్డు ముదినేపల్లి మండలం పెదగొన్నూరు జడ్పీ హైస్కూలు తెలుగు పండిట్ నేతల వెంకట రత్నంకు దక్కింది. విద్యార్థులకు తెలుగు బోధనలో ప్రతిభను కనబర్చటంతోపాటు తెలుగు భాషలో ప్రావీణ్యతను కలిగి ఉన్నందున వెంకటరత్నంను ఈ అవార్డుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఎంపిక చేశారు. ఈ అవార్డును ఆయనకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం ఏలూరులో జరిగే కార్యక్రమంలో కలెక్టర్ చేతుల మీదుగా అందుకుంటారు. వెంకటరత్నంకు పురస్కారం పట్ల హైస్కూల్ హెచ్‌ఎం ఉదయ భాస్కర్, ఇతర ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయినిగా పుష్పలత



ఆగిరిపల్లి, సెప్టెంబరు 4: ఆగిరిపల్లి జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని పులి పుష్పలత జిల్లా ఉత్తమ ఉపాధ్యాయి ని పురస్కారం లభించింది. గత సంవత్సరం 821 మంది ఉన్న విద్యార్థుల సంఖ్యను 874కు పెంచినందుకు ఈ పురస్కారం లభించినట్లు మండల విద్యాశాఖ అధికారి-1 సర్వేశ్వరరావు తెలిపారు. మండల విద్యాధికారి-2 ఆనంద్‌కుమార్ పుష్పలతను అభినందించారు.

రూ.10 కోట్లతో చెరువుల మరమ్మతులు: ఆర్డీవో

నూజివీడు, సెప్టెంబరు 4: నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న చెరువుల గండ్లు పూడ్చి మరమ్మతులు చేసేందుకు రూ.10 కోట్లు వ్యయం అవుతుందని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు నూజివీడు ఆర్డీవో భవానీ శంకరి తెలిపారు. బుధవారం నూజివీడులో ఆమె మాట్లాడుతూ తాత్కాలిక ప్రాతిపదికన మరమ్మతు చేసేందుకు నూజివీడు పెద్దచెరువుకు పడిన గండికి రూ.25 లక్షలు, డివిజన్‌లో గండ్లుపడిన మిగిలిన 23 చెరువులకు కలిపి 1.50 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. శాశ్వత మరమ్మతులకు రూ.10 కోట్లు వ్యయం అవుతుందని సంబంధిత అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు ఆమె తెలిపారు. వర్షాలు తగ్గిన తరువాత మరమ్మతు పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. తిరిగి వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



చెక్కపల్లి అంబేద్కర్‌నగర్‌లో వరద బాధితులతో మాట్లాడుతున్న ఆర్డీవో

చెరువు కట్టను బలోపేతం చేయండి

ముసునూరు: చెక్కపల్లిలో ప్రమాదకరంగా ఉన్న పెద్దచెరువు కట్టను నూజివీడు ఆర్డీవో బుధవారం పరిశీలించారు. వరదనీరు ఉధృతంగా చేరడంతో చెరువు పూర్తిస్థాయిలో నిండిందన్నారు. అయితే చెరువు కట్ట ప్రమాదకరంగానే ఉందని, తక్షణమే ఇసుక బస్తాలతో బలోపేతం చేయాలని ఇరిగేషన్ ఏఈ సలీమ్‌కు సూచించారు. వర్షం పడితే చెరువులోకి చేరే నీరువల్ల కట్ట తెగిపోయే ప్రమాదం ఉందని, 24 గంటలు చెరువుకట్టను పర్యవేక్షించేలా సచివాలయ సిబ్బందిని నియమించాలని, ఎప్పటికప్పుడూ పరిస్థితిని తెలియజేయాలని తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు ఆర్డీవో భవానీ శంకరి సూచించారు. వర్షం పడితే వెంటనే ఈ చెరువు ముందు భాగంలో నివాసం ఉంటున్న వారిని ఇళ్ల నుంచి ఖాళీ చేయించి, జడ్పీపాఠశాలలో పునరావాసం కల్పించాలన్నారు. ఏఈ సలీమ్ పర్యవేక్షణలో కట్ట బలోపేతం పనులు చేపట్టారు. చెక్కపల్లి అంబేద్కర్‌నగర్ బాధిత కుటుంబాలను బుధవారం ఆర్డీవో భవానీ శంకరి పరామర్శించారు. సుమారు 30 బాధిత కుటుంబాల ఇళ్ళ వద్దకు వెళ్ళి పునరావాస కేంద్రంలో అందిన సౌకర్యాలు, వైద్య సేవలపై బాధితులను ఆమె ఆరా తీశారు. అంబేద్కర్ నగర్ ముంపునకు గురికావడానికి ప్రధాన కారణం బసవరపుపాడు వాగును ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేయడం వల్లేనని కాలనీవాసులు ఆర్డీవో దృష్టికి తీసుకురావడంతో ఆమె వాగులో ఉన్న ఆక్రమణలను పరిశీలించారు. అక్రమ కట్టడాలను తొలగిస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు. సర్పంచ్ రాధికా సత్యనారాయణ, ఎంపీటీసీ పుష్పావతి శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ ఎమిలికుమారి, వీఆర్వో పాయస్, కార్యదర్శి సుజాత, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


రూ. 126 కోట్ల ఉపాధి పనులకు ఆమోదం



మాట్లాడుతున్న ఎంపీడీవో

చాట్రాయి, సెప్టెంబరు 4: చాట్రాయి మండలంలో 18 గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పథకం కింద రూ. 126 కోట్లు విలువైన 1352 పనులకు బుధవారం ఎంపీపీ లంకా నిర్మల అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఆగస్టు 23న అన్ని గ్రామ పంచాయతీలలో జరిగిన ప్రత్యేక గ్రామసభలో చేసిన తీర్మానాలపై సభలో చర్చించి ఆమోదించారు. చనుబండ, జనార్దనవరం ఎంపీటీసీలు సోనీ ఆనంద్, పి. కృష్ణ మాట్లాడుతూ పైప్‌లైన్లు లీకై కుళాయిల్లో బురద నీరు వస్తున్నదని వాటినే స్నానం చేయటం, తాగటం వలన జ్వరాలు, ఒళ్ళు నొప్పులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పారిశుధ్యం కూడా అధ్వానంగా ఉంటున్నదని వెంటనే పరిస్థితి చక్కదిద్దాలని కోరారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో దుర్గాప్రసాద్ హామీ ఇచ్చారు. కృష్ణారావు పాలెం ఎంపీటీసీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమావేశానికి వచ్చిన సభ్యులకు తాగునీరు కూడా ఇవ్వకపోవటంపై అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ఎంఈవో బ్రహ్మచారి మాట్లాడుతూ మండలంలోని కొన్ని పాఠశాలల ఆవరణలలో నీరు నిలవటం వలన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని సమస్య పరిష్కారానికి ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని కోరారు. వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



నూజివీడు టౌన్, సెప్టెంబరు 4: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో మామిడి తోటల్లో ఉన్న నిల్వ నీటిని బయటకు పంపుకోవాలని డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ వర్సిటీ, నూజివీడు మామిడి పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బొర్రా కనకమహాలక్ష్మి సూచించారు. బుధవారం జిల్లా ఉద్యానశాఖ అధికారి రామ్మోహన్‌తో కలిసి నూజివీడు మండలం మీర్జాపురంలో మిర్చి పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడి ఉమ్మడి కృష్ణాజిల్లాలోను, ఉభయ గోదావరి, రాయలసీమ జిల్లాల్లో అధిక విస్తీర్ణంలో సాగులో ఉందన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నిలిచిన నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపుకోవాలన్నారు. చెట్ల మధ్య దున్ని తేమ ఆవిరయ్యేలా చూడటంతో పాటు 500 గ్రాముల యూరియా, 500 గ్రాముల పశువుల ఎరువు కలిపి 25 కిలోల చొప్పున ఒక్కొక్క చెట్టుకు వేసుకోవాలన్నారు. జల్లెడ పురుగు కనిపిస్తే గుడ్లను తొలగించి క్వినాల్‌పాస్ 200 మి.మీ 1 లీటర్‌లో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. రసం పీల్చే పురుగులు కనిపిస్తే ఇమిడిక్లోప్రిడ్ 0.3 ఎంఎల్ 1 లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

పునరావాస కేంద్రాల ఏర్పాటు

కలిదిండి, సెప్టెంబరు 4 : మండలంలో ముంపు బాధితులకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. పడమటిపాలెం ముంపు బాధితులకు గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఉప్పుటేరు తీర గ్రామమైన సున్నంపూడి ముంపు బాధితులకు గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించటానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయన ఉప్పుటేరును పరిశీలించారు.

ఉపాధ్యాయులకు పని సర్దుబాటు కౌన్సెలింగ్

చాట్రాయి, సెప్టెంబరు 4: చాట్రాయి మండల విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం ఎంఈవో బ్రహ్మచారి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు పని సర్దుబాటు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌లో 28 ఎస్‌జీటీ పోస్టుల కొరత ఉన్నట్లు గుర్తించి, మండలంలో వివిధ పాఠశాలల్లో అదనంగా ఉన్న 15 మంది ఉపాధ్యాయులను సదరు ఖాళీలలో భర్తీ చేసినట్టు ఎంఈవో చెప్పారు. ఇంకా 13 మంది ఉపాధ్యాయుల కొరత ఉన్నదని, ఈ ఖాళీలను డివిజన్ స్థాయి కౌన్సిలింగ్‌లో భర్తీ చేస్తామని ఎంఈవో అన్నారు.



ఉప్పరగూడెంలో సార్వా వరి పొలాల్లో ముంపు

పొలాల్లో పెరుగుతున్న ముంపు

ముదినేపల్లి, సెప్టెంబరు 4 : ముదినేపల్లి ప్రాంత వరి పొలాల్లో ముంపు పెరుగుతున్నది. అల్పపీడనం ఫలితంగా కురిసిన భారీ వర్షాలకు పొలాల్లో ఏర్పడిన ముంపు తగ్గకముందే తిరిగి మంగళవారం రాత్రి నుంచి వర్షాలు కురుస్తుండటం, పొలాలకు అనుసంధానంగా ఉండే మైనర్ డ్రెయిన్లలో నీటి ప్రవాహం స్తంభించటంతో పైరు తేరుకోవటం లేదు. ఆరు రోజులుగా ముంపులో ఉన్న సార్వా వరి పైరు పాడైపోతున్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో అల్పపీడనం ఉందన్న హెచ్చరికలతో ముంపు మరింత పెరిగే ప్రమాదం ఉంది. ముదినేపల్లి మండలంలో సుమారు 17,500 ఎకరాల విస్తీర్ణంలో సార్వా వరి సాగు చేయగా, పెదలంక, పోల్‌రాజ్, పెదకొమ్మిలేరు, చినకొమ్మిలేరు, తుమ్మిడి - చెన్నూరు మేజర్ డ్రైన్ల పరిధిలో సుమారు 8 వేల ఎకరాల్లో ముంపు నెలకొంది. ఈ డ్రెయిన్లలో గుర్రపు డెక్క తొలగింపు పనులు నిర్వహిస్తున్నా కింది భాగంలో పెరిగిన కిక్కిసను తొలగించకపోవటంతో ముంపు తగ్గటం లేదు. డ్రైన్ల బాగు చేత పనులు మరో వారం రోజుల వరకు పూర్తికాదని డ్రెయినేజీ శాఖ అధికారులే చెబుతున్నారు. దీంతో సార్వా వరి పైరు చేతికి దక్కదని అర్థమవుతున్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కలిదిండి: ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో వరి పొలాలు ముంపు బారిన పడుతున్నాయి. కోరుకొల్లు, సానారుద్రవరం, గోపాలపురం, వెంకటాపురం గ్రామాల్లో వరి పొలాల్లో భారీ వర్షపు నీరు చేరింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మురుగు కాల్వల్లో పూడిక సక్రమంగా తొలగించకపోవటం వల్లే ఈ దుస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఫీడర్ చానల్‌కు భారీ గండి.. పూడ్చివేత చర్యలు



ఆగిరిపల్లి, సెప్టెంబరు 4: ఆగిరిపల్లి వరాహ పుష్కరిణికి నీరందిస్తున్న ఫీడర్ చానల్‌కు భారీ గండి పడింది. ఎగువ నుంచి వస్తున్న నీటి తాకిడికి ఈ గండి పూడ్చటం అలవి కావటం లేదు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అధికారులు శ్రమించినా ఈ గండి పూడ్చటం సాధ్యం కాలేదు. దీంతో ఫీడర్ ఛానల్‌లోని నీరు వృధాగా బయటకు పోతోంది. గురువారం ఉదయం ఎక్స్‌కవేటర్‌ను రప్పించి ఈ పనిని కొలిక్కి తేవచ్చునని సమాచారం.

ముంపులో విశ్వనాద్రిపాలెం.. పట్టించుకోని అధికారులు?

ముదినేపల్లి, సెప్టెంబరు 4 : వర్షాలకు జలమయమైన ముదినేపల్లి మండలం పెదగొన్నూరు శివారు విశ్వనాద్రిపాలెం గ్రామం నేటికీ ముంపు నుంచి తేరుకోలేదు. ముంపు నీరు బయటికి వెళ్లే మార్గాలు ఆక్రమణలకు గురికావటం, గ్రామం పక్కనే ఉన్న కాల్వ పూడిపోవటంతో గ్రామంలోని పలు కుటుంబాలు ముంపు నీటితోనే సహజీవనం చేస్తున్నారు. గృహాల ఆవరణల్లోకి, గృహాల్లోకి వెళ్లిన వర్షపు నీరు నాలుగు రోజులుగా తగ్గనేలేదు. దోమల బెడద పెరిగింది. నిల్వ నీటితో దుర్వాసన వెదజల్లటమే కాక, పాములు, ఇతర విష జంతువులు గృహాల వద్దకు వచ్చే ప్రమాదం ఉందని, పంచాయతీ అధికారులు వెంటనే చర్యలు తీసుకుని ముంపు నీటిని బయటకు తోడించాలని టీడీపీ నాయకులు వీరంకి చక్రపాణి కోరారు.

బాధితులకు ఆపన్న హస్తం

'దేశం' నాయకుడు రూ. లక్ష విరాళం



సీఎంకు చెక్కు అందజేస్తున్న బంగార్రాజు

కలిదిండి, సెప్టెంబరు 4 : మండలంలోని తాడినాడ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కొత్తపల్లి బంగార్రాజు బుధవారం విజయవాడ కలెక్టరేట్‌లో సీఎం చంద్రబాబును కలసి వరద బాధితుల కోసం లక్ష రూపాయల చెక్కును విరాళంగా అందించారు. వరద బాధితులకు సాయమందించటానికి దాతలు ముందుకు రావటం అభినందనీయమని మానవతా దృక్పథంతో బాధితులను ఆదుకోవాలని సీఎం సూచించారని తెలిపారు. టీడీపీ నాయకుడు సొర్రా అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ 3 వేల ఆహార పొట్లాల తరలింపు

నూజివీడు టౌన్: వరద బాధితుల సహాయార్థం మేము సైతం అంటూ నూజివీడు రోటరీ క్లబ్ ఆఫ్ మ్యాంగో టౌన్ ఆధ్వర్యంలో 3 వేల ఆహార పొట్లాలు, 5 వేల వాటర్ ప్యాకెట్లను విజయవాడ తరలించారు. రోటరీ క్లబ్ నూజివీడు పట్టణ అధ్యక్షుడు దోనేపూడి నరేంద్ర మాట్లాడుతూ ప్రజలకు ఎప్పుడూ ఇబ్బందులు ఎదురైనా రోటరీ తన వంతు సహకారం ఎల్లప్పుడు అందిస్తుంద న్నారు. కార్యదర్శి కొలుసు సత్యనారాయణ, సభ్యులు మల్లిశెట్టి శ్రీనివాస్ ఆర్.రామ్మోహన్‌రావు, లావు మురళీమోహన్, పైడి అనిల్, గొల్లపూడి రవిబాబు, కొడాలి జయరాం తదితరులు పాల్గొన్నారు.

గాడ్సన్ మినిస్ట్రీస్ సేవలు

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి మండలం పోతవరప్పాడులోని గాడ్స్ అండ్ మినిస్ట్రీస్ సేవకుడు పాల్ రమేష్ విజయవాడ వరద బాధితులకు ఐదు ట్రాక్టర్ ట్యాంకర్ల మినరల్ వాటర్ వెజిటెబుల్ పలావ్, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. సాయం చేయదలచిన వారు మంచినీరు కూడా తీసుకువెళ్లాలని, మెయిన్‌రోడ్డులో కాకుండా దూరప్రాంతాల్లో ఉన్న ఇళ్ళకు కూడా వెళ్ళి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వీరికి నెక్కలం గొల్లగూడెం మాజీ జడ్పీటీసీ కాజా రాంబాబు సహాయ సహకారాలు అందించారు. తహసీల్దార్ పి.ఎస్.వి ప్రసాద్ ఆదేశాలతో అంగన్‌వాడీ ఆయాలు ఆహారాన్ని ప్యాకింగ్ చేసి సిద్ధం చేశారు. మూడోరోజు బుధవారం కూడా 5 వేల ప్యాకెట్లు వెజిటెబుల్ బిర్యానీ సిద్ధం చేశారు.

2 వేల వాటర్ బాటిళ్ల పంపిణీ

చాట్రాయి: నూజివీడు ఎమ్మెల్యే, గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి స్ఫూర్తితో మండలంలోని చనుబండకు చెందిన టీడీపీ దళిత నాయకుడు నక్కా రాము తన సొంత నిధులతో బుధవారం 2 వేల వాటర్ బాటిల్స్‌ను ఆటోలో విజయవాడ తీసుకువెళ్ళి వరద బాధితులకు పంపిణీ చేశారు. నక్కా రామును మంత్రి సారథి అభినందించి, నియోజకవర్గంలో ప్రతి ఒక్కరూ మానవత్వంతో స్పందించి తమ శక్తి మేర వరద బాధితులకు సహాయం అందించాలని పిలుపు నిచ్చారు.

తెలుగు తమ్ముళ్ల వితరణలు

ముసునూరు: విజయవాడ వరద బాధితులకు టీడీపీ నాయకులు చేయూతనిచ్చారు. గోపవరం యువనేత ఉప్పలపాటి గణేష్, కాట్రేనిపాడు యువనేత రాపర్ల మురళీ, నాయకులు రాపర్ల ప్రతాప్, రావర్ల బాలకృష్ణ సూమారు 15 వేల బిర్యానీ ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్‌ను బుధవారం అందజేశారు. ముసునూరు సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మీయా తనయుడు, నియోజకవర్గ తెలుగుయువత కార్యదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్ (బాబి) వరద బాధితుల సహాయార్థం రూ. 10 వేల నగదును సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళంగా ఇచ్చారు. అలాగే బీసీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నక్కా యోహాను, ఉప సర్పంచ్ తోట శ్రీనివాసరావు, వార్డు సభ్యుడు రెడ్డి కృష్ణ మరో రూ. 10వేలు విరాళంగా ఇచ్చారు. యువనేత పి.సీతారామ్ 1500 బిర్యానీ ప్యాకెట్లను బాధితులకు పంపిణీ చేశారు. వీరిని మంత్రి పార్థసారథి అభినందించారు.

ముదినేపల్లిలోని పలు సంఘాల చేయూత

ముదినేపల్లి: విజయవాడ వరద బాధితులను ఆదుకునేం దుకు ముదినేపల్లి మండలంలోని పలు సంఘాలు నడుం బిగించాయి. గురజ గ్రామ యువకులు రెండు వాహనాల ఆహార పొట్లాలు, ముదినేపల్లి మండలం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చీదెళ్ల సుబ్రహ్మణ్యేశ్వరరావు, వాసవీ సేవా దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వత్తుమిల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో 20 లీటర్ల సామర్థ్యం కలిగిన 300 వాటర్ క్యాన్లు, ముదినేపల్లి రజక సంఘం అధ్యక్షుడు యలకుర్తి నాగరాజు, ఉపాధ్యక్షుడు మీసాల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆహార పొట్లాలు, ముదినే పల్లిలోని పరసా వారి శ్రీ లక్ష్మీ ట్రేడర్స్, మంగినేని పైవుడ్స్ అండ్ హార్డ్‌వేర్ సంస్థ ఆధ్వర్యంలో ఆహార పొట్లాలు సరఫరా చేసి అక్కడి ట్రస్టుల ద్వారా బాధితులకు అందజేశారు.

నూజివీడు డివిజన్‌లో 196.2 మి.మీ.వర్షపాతం

నూజివీడు, సెప్టెంబరు 4:నూజివీడు రెవిన్యూ డివిజన్ పరిధిలో గత 24 గంటల్లో 192.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు ఆర్డీవో భవాని శంకరి తెలిపారు. అత్యధికంగా ఆగిరిపల్లి మండలంలో 70.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా చింతలపూడిలో 10.4 మిల్లీమీటర్లు నమోదైంది. చాట్రాయి మండలంలో 34.2 మిల్లీమీటర్ల వర్షపాతం, లింగపాలెంలో 31.4, ముసునూరులో 26.2, నూజివీడులో 23.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. కాగా నూజివీడు డివిజన్ సరాసరి వర్షపాతం 32.7 మిల్లీమీటర్లుగా నమోదైంది.

బస్సు సర్వీసుల పునరుద్ధరణ

నూజివీడు టౌన్, సెప్టెంబరు 4: వరదల నేపథ్యంలో నూజివీడు డిపో నుంచి రద్దు చేసిన సర్వీసులను తిరిగి పునరుద్ధరించినట్లు నూజివీడు ఆర్టీసీ డిపో మేనేజర్ పవన్‌కుమార్ తెలిపారు. దూర ప్రాంత సర్వీసులైన శ్రీశైలం, తిరుపతి, యర్రగుంటపాలెం సర్వీసులను హనుమాన్ జంక్షన్, గన్నవరం, విజయవాడ మీదుగా ప్రత్యామ్నాయ మార్గంలో నడుపుతుండగా విజయవాడ - హైదరాబాద్ సర్వీసును కూడా బుధవారం నడిపినట్టు ఆయన తెలిపారు. బుడమేరు వరద ఉధృతి కారణంగా మచిలీపట్నం సర్వీసును మాత్రం పుట్టగుంట వరకు మాత్రమే నడుపుతు న్నామని చెప్పారు.

హెల్త్ సెంటర్‌కు మంత్రి కుర్చీల వితరణ



నూజివీడు టౌన్, సెప్టెంబరు 4: నూజివీడు అర్బన్ హెల్త్ సెంటర్‌కు మంత్రి పార్థసారథి 50 కుర్చీలను తన సొంత నిధులతో సమకూర్చారు. పట్టణంలోని కోనేరుపేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు వచ్చే రోగుల సౌకర్యం కోసం కుర్చీలు ఇవ్వాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, నూజివీడు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథిని వైద్య ఆరోగ్య సిబ్బంది కోరగా తన వ్యక్తిగత సిబ్బందితో కుర్చీలను సిబ్బందికి అందించారు. మంత్రికి సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ నేత వల్లభనేని సుబ్బారావు మృతి



ముదినేపల్లి, సెప్టెంబరు 4 : టీడీపీ సీనియర్ నాయకుడు, ముదినేపల్లి మండలం కోడూరు మాజీ సర్పంచ్ వల్లభనేని వెంకట సుబ్బారావు (షావుకారు సుబ్బన్న) (78) హఠాన్మరణం చెందారు. బుధవారం ఆయనకు ఛాతీ లో నొప్పి రాగా, వెంటనే గుడివాడలోని ఓ ప్రైవేట్ ఆసు పత్రికి తీసుకెళ్లినా గుండెపోటుకు గురై మరణించారు. 1985 నుంచి ఆయన టీడీపీలో మండల స్థాయిలో క్రియాశీలక నాయకుడిగా వ్యవహరించారు. సర్పంచ్‌గా కోడూరులో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేశారు. ఆయన మృతి పట్ల టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభ నాద్రి చౌదరి, పార్టీ నాయకులు వీరమల్లు నరసింహా రావు, కొడాలి వినోద్, చలసాని జగన్మోహనరావు, కోడూరు శేషుబాబు తదితరులు సంతాపం తెలిపారు.

ముంపు నివారణకు పూడికతీత

చాట్రాయి, సెప్టెంబరు 4: చనుబండలో చిన్న చెరువు అలుగు కాలువ పూడిక తీయకపోవడంతో ఎస్సీ కాలనీలో వర్షం నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి ఆధ్వర్యంలో బుధవారం ఎక్స్‌కవేటర్ ఏర్పాటు చేసి కాలువలో పూడిక తొలగించటంతో ముంపు సమస్య పరిష్కారమైంది. దీంతో ఎస్సీ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.